ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కాకినాడ
జిల్లా వార్తలు
మంగళవారం 20 మే 2025 | 5



కాకినాడ

ఉష్ణోగ్రతలు

గరిష్ఠం : 33(సోమవారం)
కనిష్ఠం : 27

జిల్లాలో పిఠాపురం, గొల్లప్రోలు, సామర్లకోటల్లో సోమవారం భారీవర్షం కురిసింది. వేసవిలోను వర్షాలు పడుతుండడంతో వేడిమి నుంచి ఉపశమనం లభించి ప్రజలు సేదతీరుతున్నారు. కానీ, పొలాల్లో ధాన్యం ఉండిపోయిన రైతులు మాత్రం ఆవేదన చెందుతున్నారు.



పిఠాపురం పట్టణంలో జోరుగా కురుస్తున్న వర్షం



మండే ఎండలకు... మందు!



ఊదిపారేస్తున్నారంతే...

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో గతేడాది ఏప్రిల్‌లో బీర్లు, ఇతర ఐఎంఎల్ మద్యం విక్రయాలు కలిపి రూ.276 కోట్లు జరిగాయి. ఈ ఏడాది ఏప్రిల్‌లో విక్రయాలు రూ.293 కోట్లకు పెరిగాయి. ఇందులో అత్యధికంగా బీర్లు అమ్ముడయ్యాయి. గతేడాది ఏప్రిల్‌లో ఉమ్మడి జిల్లాలో 1,21,396 కేసుల బీర్లు విక్రయించగా ఈ ఏడాది ఏప్రిల్‌లో ఏకంగా 2,81,637 కేసుల బీర్లు మందుబాబులు తాగేశారు. బీర్ల విక్రయాలు అప్పటితో పోల్చితే ఈసారి 133 శాతానికిపైగా పెరిగాయి.

- కాకినాడ జిల్లాలో 2024 ఏప్రిల్‌లో రూ.95.52 కోట్ల విలువైన మద్యం అమ్ముడైంది. ఇందులో 41,940 కేసుల బీర్లు ఉండగా, ఐఎంఎల్ మద్యం 96,317 కేసులు ఉన్నాయి. ఈ ఏడాది ఏప్రిల్‌కు వచ్చేసరికి ఈనెలలో కాకినాడ జిల్లాలో విక్రయాలు రూ.104కోట్లకు పెరిగింది. ఒక్క బీర్లే ఏకంగా 97,796 కేసులు అమ్ముడయ్యాయి. కాకినాడ నార్త్ స్టేషన్ పరిధిలో గత నెలలో ఏకంగా రూ.26కోట్ల మద్యం అమ్ముడైంది. కాకినాడ సౌత్ స్టేషన్ పరిధిలో రూ.18 కోట్లు, తుని పరిధిలో రూ.15.84 కోట్ల విక్రయాలు జరిగాయి.
- తూర్పుగోదావరి జిల్లాలో గతేడాది ఏప్రిల్ నెలలో రూ.90.76 కోట్ల విలువైన మద్యం విక్రయాలు జరగ్గా, ఈ ఏడాది 100.23కోట్ల మద్యం అమ్ముడైంది. ఒక్క బీర్ల విక్రయాల్లో ఏకంగా 114 శాతం పెరుగుదల నమోదైంది. అత్యధికంగా రాజమహేంద్రవరం నార్త్ స్టేషన్ పరిధిలో గత నెలలో రూ.22.66 కోట్లు మద్యం విక్రయాలు జరగ్గా, బీర్ల విక్రయాల్లో 131 శాతం వృద్ధి నమోదైంది. రాజమహేంద్రవరం దక్షిణం పరిధిలో రూ.20.44 కోట్లు, నిడదవోలు పరిధిలో 13.44కోట్లు, దేవరపల్లి 12.33 కోట్లు, కోరుకొండ 8.91 కోట్లు చొప్పున మద్యం విక్రయాలు జరిగాయి. దేవరపల్లి సర్కిల్ పరిధిలో గతేడాది ఏప్రిల్‌లో 3,623 కేసుల బీర్లు అమ్ముడైతే ఈ ఏడాది ఏప్రిల్‌లో ఏకంగా 9,253 బీర్ల కేసులు విక్రయించారు. బీర్ల విక్రయాల్లో గతేడాదితో పోల్చితే 155 శాతం అధికం.
- డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 2024 ఏప్రిల్‌లో రూ.90.11 కోట్ల మద్యం విక్రయాలు జరగ్గా ఈ ఏడాది ఏప్రిల్‌లో రూ.88.81 కోట్లు నమోదయ్యాయి. ఇక్కడ గతేడాదితో పోల్చితే ఏప్రిల్‌లో విక్రయాలు కొంత తగ్గాయి. ప్రధానంగా ఈ జిల్లాలో 2024 ఏప్రిల్‌లో ఈ జిల్లాలో 95,444 కేసుల ఐఎంఎల్ మద్యం అమ్ముడైతే ఈ ఏడాది ఏప్రిల్‌లో 1,17,484 కేసుల ఐఎంఎల్ అమ్ముడైంది. బీరు కేసులు అప్పట్లో 34,036 విక్రయిస్తే.. గత నెలలో 79,005 కేసులు విక్రయించారు. బీర్ల విభాగంలో అమ్మకాలు అప్పటితో పోల్చితే 132 శాతం పెరిగాయి.

(కాకినాడ/ రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

వేసవి ఉపశమనం కోసం మందుబాబులు తెగ తాగేస్తున్నారు. దీంతో మద్యం విక్రయాలు రయ్‌మని పరుగులు తీస్తున్నాయి. వేసవి తీవ్రత కారణంగా గత నెల నుంచి మద్యం విక్రయాలు భారీగా పెరిగిపోయాయి. ఒక్క ఏప్రిల్‌లోనే మందుబాబులంతా కలిపి ఉమ్మడి జిల్లాలో రూ.293 కోట్ల మద్యం తాగేశారు. గతేడాది ఇదేనెలలో విక్రయాలతో పోల్చితే రూ.17 కోట్లు అధికం. బీర్ల విక్రయాలైతే ఏకంగా 133 శాతం పెరిగాయి. గతేడాది ఏప్రిల్‌లో ఉమ్మడి జిల్లాలో మందుబాబులు 1.21 లక్షల బీరు కేసులు తాగేస్తే ఈ ఏడాది ఏప్రిల్‌లో 2.81 లక్షల బీరు కేసులు ఎత్తేశారు. విభజిత జిల్లాల వారీగా పరిశీలిస్తే కాకినాడ జిల్లాలో గతేడాది ఏప్రిల్‌లో రూ.95.52 కోట్లు అమ్మకాలుంటే ఈ ఏడాది ఏప్రిల్‌లో రూ.104 కోట్లకు చేరింది. తూర్పుగోదావరి జిల్లాలో గతేడాది ఏప్రిల్‌లో రూ.90.76 కోట్లు ఉంటే ఇప్పుడు రూ.100.23 కోట్లకు చేరింది. కోనసీమను మినహాయిస్తే ఈ రెండు జిల్లాల్లో విక్రయాలు భారీగా పెరిగాయి.

ఈనెలలో అప్పుడే రూ.150 కోట్లకుపైగానే..

మే నెలలోను మందుబాబులు తగ్గేదేలే అన్నట్టు తెగ తాగేస్తున్నారు. ఇప్పటివరకు కాకినాడ జిల్లాలో రూ.53 కోట్ల విలువైన మద్యం తాగేశారు. బీరు కేసులు గతేడాది మే నెల 16 వరకు జిల్లాలో 24,339 విక్రయించగా ఇప్పుడు 56,375 అమ్ముడయ్యాయి. కోనసీమ జిల్లాలో గతేడాది మే నెల మొత్తం మీద రూ.98.88 కోట్ల సరుకు విక్రయించగా ఈనెలలో ఇప్పటివరకు రూ.45.41కోట్ల మద్యం అమ్ముడైంది. తూర్పుగోదావరి జిల్లాలో 58,950 ఐఎంఎల్ కేసులు, 50,587 బీరు కేసులు విక్రయించడంతో రూ.49.46 కోట్ల విక్రయాలు నమోదయ్యాయి. వాస్తవానికి గత వైసీపీ ప్రభుత్వంలో మద్యం ధరలు మందుబాబులకు షాక్ కొట్టాయి. నాసిరకం బ్రాండ్లకు ప్రీమియం ధరలు వసూలు చేసి వందల కోట్లు పిండేశారు. ప్రస్తుత ప్రభుత్వం ధరలు అమాంతం తగ్గించేసింది. బీరు, ఐఎంఎల్ ప్రముఖ బ్రాండ్లను అన్ని దుకాణాల్లో అందుబాటులో ఉంచింది. ధరలు తగ్గడం.. వేసవితో మందుబాబులు తెగ తాగేయడంతో అమ్మకాలు పెరిగాయి.

ఉమ్మడి జిల్లాలో బీర్లు పొంగాయ్

- వేసవి ఉపశమనం పేరుతో తెగతాగేశారు
- ఉమ్మడి తూ.గో.జిల్లాలో పెరిగిన అమ్మకాలు
- ఏప్రిల్‌లో రూ.293 కోట్ల మద్యం విక్రయాలు
- గతేడాది పోల్చితే రూ.17 కోట్లు అధికం
- రికార్డు స్థాయిలో బీర్లను తాగేసిన ప్రియులు
- గత నెలలో 2.81 లక్షల బీరు కేసులు
- గతేడాది ఇదే నెలలో 1.21 లక్షల కేసులే
- గతేడాదితో పోల్చితే 133 శాతం అధికం
- ఈ నెలా మద్యం విక్రయాలు రయ్
- 16 నాటికి రూ.150 కోట్ల మేర సేల్స్
- బీరు కేసులు 1.49 లక్షల విక్రయం

రేపటి నుంచి సామర్లకోట-కాకినాడ రోడ్డులో..

వాహనాల మళ్లింపు



సామర్లకోట సాగరమాల జాతీయ రహదారిలో వంతెన నిర్మాణ పనులు జరిగే ప్రదేశం

సామర్లకోట, మే 19(ఆంధ్రజ్యోతి): సామర్లకోట-కాకినాడ ప్రధాన రహదారిలో బుధవారంనుంచి ట్రాఫిక్ మళ్లించనున్నారు. ముత్యాలమ్మ విగ్రహం సమీపాన సాగరమాల జాతీయరహదారి నిర్మాణం జరుగుతోంది. ఈ పనుల్లో భాగంగా వంతెన నిర్మిస్తున్న కారణంగా ఈనెల 21 నుంచి 24 వరకూ నాలుగు రోజులపాటు ఉండూరు ఫ్లైఓవర్ బ్రిడ్జి ఏడీబీ రోడ్డుమీదుగా ఉండూరు, పనసపాడు, గైగోలుపాడు, సర్పవరం మీదుగా కాకినాడకు వాహనాల రాకపోకలను మళ్లించేందుకు చర్యలు తీసుకున్నామని సామర్లకోట ట్రాఫిక్ ఎస్ఐ అడపా గరగారావు వెల్లడించారు. ఈ మేరకు సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాకినాడనుంచి సామర్లకోటకు వచ్చే వాహనాలు కూడా అదే రహదారిలో రావాలన్నారు. వెంకటకృష్ణరాయపురం, మాధవపట్నం గ్రామాలకు వెళ్లే వాహనాలు ఏడీబీ రోడ్డులోని ఉండూరు జంక్షన్ మీదుగా వీకే రాయపురం వెళ్లాలని సూచించారు. ఈనెల 27,28 తేదీల్లో మండలంలోని అచ్చంపేటవద్ద నిర్మిస్తున్న వంతెనపనుల కారణంగా రెండురోజులపాటు ఏడీబీ రోడ్డులో వాహనాల రాకపోకలు మూసివేయనున్నట్లు తెలిపారు. ఏడీబీ రోడ్డు మీదుగా వెళ్లే వాహనాలు ఈ రెండురోజుల్లో కెనాల్ రోడ్డు మీదుగా మళ్లించామన్నారు. ప్రయాణికులు ట్రాఫిక్ సిబ్బందికి, పోలీసులకు సహకరించాలని కోరారు.

అర్జీలను నాణ్యతతో పరిష్కరించాలి: కలెక్టర్



అర్జీలను స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్(కాకినాడ), మే 19 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో అందిన వినతులను అర్జీదారుడు సంతృప్తి చెందేలా నాణ్యతతో సకాలంలో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ అధికారులను ఆదేశించారు. కాకినాడ కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్జీదారుల అర్జీలు పరిష్కరించేటప్పుడు జిల్లా అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి ఎండార్స్‌మెంట్ వేయాలన్నారు. సక్రమంగా పరిష్కరించని వాటిని రెండు స్థాయిల్లో ఆడిట్ జరిపి మళ్లీ రీఓపెన్ చేసిన శాఖ అధికారులు ప్రత్యేక దృష్టిసారించాలన్నా రు. అర్జీదారులు వారి అర్జీలు(మీకోసం.ఏపీ. జీవోవీ.ఇన్) వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవచ్చునన్నారు.మొత్తం 418 అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో జేసీ రాహుల్‌మీనా, జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు, హౌసింగ్ పీడీ సత్యనారాయణ, సీపీవో త్రినాథ్ పాల్గొన్నారు.

ఎస్పీ గ్రీవెన్స్‌కు 69 అర్జీలు



అర్జీదారుల గోడు వింటున్న ఎస్పీ బిందుమాధవ్

కాకినాడక్రైం, మే 19 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత సమస్యలతో బాధపడుతూ స్థానికంగా పరిష్కారం కాక జిల్లావ్యాప్తంగా 69మంది అర్జీదారులు సోమవారం ఎస్పీ జి.బిందుమాధవ్ నిర్వహించిన పోలీస్ గ్రీవెన్స్‌ను ఆశ్రయించారు. ఈ సందర్భంగా ఎస్పీ అర్జీదారుల సమక్షంలోనే సంబంధిత పోలీస్ అధికారులతో మాట్లాడి ఫిర్యాదు సమ్మతమైనదైతే ఎఫ్ఐఆర్ నమోదు చేసి వేగవంతంగా దర్యాప్తు పూర్తి చేసి సాధ్యమైనంత త్వరితగతిన సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లా పోలీస్ కార్యాలయానికి రాలేని ఫిర్యాదుదారులు సంబంధిత పోలీస్‌స్టేషన్లలోను, సర్కిల్ కార్యాలయాల్లోను సబ్‌డివిజన్ కార్యాలయాల్లోను ఫిర్యాదు చేయవచ్చన్నారు.

పోలీసుల విస్తృత తనిఖీలు



పోలీస్ జాగిలంతో బస్సులో తనిఖీలు నిర్వహిస్తున్న దృశ్యం

కాకినాడక్రైం, మే 19(ఆంధ్రజ్యోతి): ఏక్షణంలో ఏం జరిగినా అప్రమత్తంగా ఉండాలన్న లక్ష్యంతో జిల్లా పోలీస్‌శాఖ ఎప్పటికప్పుడు జిల్లావ్యాప్తంగా జల్లెడ పడుతోంది. ఎస్పీ జి.బిందుమాధవ్ ఆదేశాలతో ప్రజారవాణా కేంద్రాలైన బస్టాండ్‌లు, రైల్వేస్టేషన్‌లు, రద్దీ కూడళ్లలో పోలీసులు బాంబ్ స్క్వాడ్, పోలీస్ జాగిలాలతో విస్తృత తనిఖీలు నిర్వహించారు. అనుమానాస్పద వస్తువులు, సంచులను తనిఖీ చేసి అనుమానాస్పద లేదా కొత్త వ్యక్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రయాణికులకు ఎటువంటి అనుమానాస్పద వస్తువులు తారసపడినా అనుమానాస్పదంగా ఎవరు సంచరిస్తున్నా వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌ల అధికారులకు సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. తనిఖీల్లో వివిధ స్టేషన్‌ల సీఐలతోపాటు ప్రత్యేక పోలీస్ బలగాలు, బాంబ్ నిర్వీర్య విభాగం పాల్గొన్నాయి.

అను‘గృహా’మెప్పుడో!

- టిడ్కో ఇళ్ల కోసం ఏళ్ల తరబడి ఎదురుచూపులు
- కాకినాడలో ఫేజ్-2 లబ్ధిదారులు 904 మంది
- అసంపూర్తిగానే నిర్మాణాలు
- ఇళ్లు అందక ఆందోళనలో లబ్ధిదారులు
- జూన్ 12నాటికి ఇస్తామంటున్న టిడ్కో అధికారులు

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

సొంతింటి కల తీరుతుందని ఆశించాం.. అద్దె ఇంటి బాధలు తొలగుతాయని ఆనందపడ్డాం.. టిడ్కో గృహాలు ఇస్తారంటే ముందస్తుగా డబ్బులు కూడా చెల్లించాం.. ఒకటి కాదు రెండు కాదు.., ఏకంగా పదేళ్ల నుంచి ఇళ్ల కోసం ఎదురుచూస్తున్నాం. ఇప్పటికీ ఆ కోరిక నెరవేరలేదు. ఇళ్లు రాకపోగా... ఆ ఇంటికి సంబంధించిన లోన్ వాయిదాలను మాత్రం బ్యాంకులకు నెలనెలా చెల్లిస్తున్నాం’.. ఇదీ కాకినాడ నగరంలో టిడ్కో గృహ లబ్ధిదారుల ఆవేదన

సొంతింటి కల నెరవేర్చుకోవాలని దశాబ్దకాలంగా కలలు కంటున్నా నెరవేరట్లేదని టిడ్కో రెండోఫేజ్ లబ్ధిదారులు వాపోతున్నారు. మొదటి ఫేజ్‌లో ఇచ్చినవారు కొంతమంది ఇళ్లల్లో నివాసం ఉండి వివిధ కారణాలతో కొంతమంది ఖాళీ చేసి వెళ్లిపోతుండగా రెండోఫేజ్‌లో ఇంతవరకు స్వాధీనం చేయకపోవడంతో ఎప్పుడు ఇస్తారోనని మరికొంతమంది లబ్ధిదారులు ఎదురు చూస్తున్నారు. అటు మున్సిపల్, ఇటు కలెక్టర్ కార్యాలయాలకు కాళ్లరిగేలా తిరుగుతున్నారు. మరోవైపు జూన్ 12లోగా రెండో ఫేజ్‌లో ఇళ్లు స్వాధీనం చేయాలంటూ మున్సిపల్‌శాఖ మంత్రి నారాయణ సైతం ఆదేశాలు జారీ చేశారు. కాకినాడనగరంలోని పర్లోవపేటలో రెండోఫేజ్ ఇళ్ల నిర్మాణ పనులు రెండు రోజులక్రితం పునఃప్రారంభమైనట్టు టిడ్కోఅధికారులు చెప్తున్నారు. మంత్రి ఇచ్చిన గడువులోపు ఇవి పూర్తవుతాయా? లేదా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

వాయిదాల పద్ధతిలో..

కాకినాడ పర్లోవపేటలో అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో 2016లో 39 ఎకరాల్లో టిడ్కో ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభించారు. సైట్-ఏ, బీలుగా స్థలాలను విభజించి సైట్-ఎలో 1152 మందికి ఫ్లాట్లు కేటాయించారు. దీనికోసం లబ్ధిదారులను ఎంపిక చేసి వారితో రూ.లక్ష చొప్పున సొమ్ము కట్టించుకున్నారు. మిగిలిన మొత్తం రూ.3.65లక్షలు బ్యాంకు రుణంగా అందజేసేలా, ఆ రుణాన్ని వాయిదాల పద్ధతిలో చెల్లించే సౌకర్యం కల్పించారు. అప్పటికే ఫ్లాట్ల కేటాయింపునకు సంబంధించి ఒక జాబితాను సిద్ధం చేశారు. ఇంతలో ప్రభుత్వం మారింది. టిడ్కో ఇళ్ల జాబితాలో కొందరి పేర్లు మారిపోయాయి. వైసీపీ ప్రభుత్వం వారి అనుకూల లబ్ధిదారుల పేర్లను చేర్చింది. ఎట్టకేలకు ఫేజ్-1లో నిర్మించిన 1152 ప్లాట్లను లబ్ధిదారులకు అప్పగిస్తూ పత్రాలు ఇచ్చేశారు. దాదాపు అందరూ గృహప్రవేశాలు చేసుకోగా, 900 ప్లాట్లలో జనాలు ఉంటున్నారు.



టిడ్కో ఇళ్లు ఇవ్వాలంటూ కలెక్టరేట్లో వినతిపత్రం అందజేసిన లబ్ధిదారులు

రెండో ఫేజ్‌లో..

పర్లోవపేటలోనే రెండో విడతలో సైట్-బిలో 904 టిడ్కో ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. కాంట్రాక్టర్లకు నిధుల విడుదలలో జాప్యం, బిల్లుల బకాయిలు చెల్లించకపోవడం, బిల్లుల బకాయిలు పేరుకుపోవడం వంటి కారణాలతో ఇళ్ల నిర్మాణాలు అసంపూర్తిగా నిలిచాయి. ఈ ఫేజ్-2లో ఇళ్లు మంజూరైన అనేకమంది తొమ్మిదేళ్ల క్రితమే రూ.లక్ష చెల్లించేశారు. 2022లో వీరి పేరున బ్యాంకుల్లో లోన్ కూడా తీసుకున్నారు. 2023లో ఫ్లాట్ల రిజిస్ట్రేషన్ పూర్తయ్యింది. కానీ ఫ్లాట్లు మాత్రం దక్కలేదు. ఓ పక్క అద్దె ఇంట్లో ఉంటూ.. వేలాది రూపాయల అద్దె చెల్లిస్తూ.. మరోవైపు బ్యాంకు రుణ వాయిదాలు చెల్లించలేక నానా ఇబ్బందులు పడుతున్నారు.

అధికారుల చుట్టూ తిరుగుతూ..

కాకినాడ నగరంలో సుమారు 900కిపైగా లబ్ధిదారుల పరిస్థితి ఎవరికీ అర్థం కావడం లేదు. ఓ పక్క నగరపాలక సంస్థ కమిషనర్, మరోపక్క కలెక్టర్ కార్యాలయానికి తిరుగుతున్నారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కు వెళ్లి అర్జీలు అందిస్తున్నారు. తమ సొంతింటి కల నెరవేర్చాలని వేడుకుంటున్నారు. ఈ సోమవారం కూడా కలెక్టరేట్‌కు వచ్చిన లబ్ధిదారులు జిల్లా అధికారులకు వినతిప్రతం అందజేశారు. మంత్రి నారాయణ ఆదేశించినట్టుగా జూన్ 12వ తేదీలోపు తమకు ఇళ్లు అప్పగించాలని కోరారు.



అసంపూర్తి నిర్మాణంలో ఉన్న టిడ్కో ఇళ్లు

జూన్ 12లోపు అందజేస్తాం

ప్రస్తుతం ఫేజ్-2కు సంబంధించి పర్లోవపేటలో 904 గృహాలను జూన్ 12కల్లా లబ్ధిదారులకు అందించేలా చర్యలు చేపడతున్నాం. కొన్ని కారణాల రీత్యా పనులు నిలిచాయి. రెండురోజులుగా మళ్లీ ప్రారంభించాం. ఫ్లోరింగ్, ఎలక్ట్రికల్, ప్లంబింగ్ పనులు జరుగుతున్నాయి. వాటిని త్వరలోనే పూర్తి చేస్తాం. నెలాఖరుకు మొత్తం పనులు పూర్తవుతాయని భావిస్తున్నాం. మంత్రి నారాయణ మాట ప్రకారం లబ్ధిదారులకు అందించే ప్రయత్నం చేస్తాం.

-సి.రాజు, ఈఈ, టిడ్కో

బహువార్షిక ఉద్యాన పంటల సాగుకు ప్రణాళికలు

- జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్(కాకినాడ), మే 19(ఆంధ్రజ్యోతి): జిల్లాలో బహువార్షిక ఉద్యాన పంటల సాగు విస్తీర్ణాన్ని పెంచేందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశించారు. కాకినాడ కలెక్టరేట్‌లో సోమవారం బహువార్షిక ఉద్యాన పంటలసాగుపై జిల్లా వ్యవసాయం, ఉద్యాన, డ్వామా, డీఆర్డీఏ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహువార్షిక ఉద్యాన పంటలను సాగు చేయడం ద్వారా రైతులకు ఆర్థికంగా బలం చేకూరుతుందన్నారు. ఆయిల్‌పామ్ వంటి పంటలను ప్రోత్సహించడం ద్వారా జిల్లాలో ఉద్యాన పంటలసాగు విస్తీర్ణం పెంపొందించవచ్చునన్నారు. జిల్లాలో 10,616 హెక్టార్లలో ఉద్యాన పంటల సాగుకుగాను 6వేల హెక్టార్లలో ఆయిల్‌పామ్ సాగు చేయడానికి అవసరమైన కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. అధికారులు డ్వామా, డీఆర్డీఏ అధికారుల సమన్వయం చేసుకుని పనిచేయాలన్నారు. ఆయిల్‌పామ్ సాగు చేసే రైతులు తప్పనిసరిగా నీటి గుంతలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ నీటి గుంతలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా ఆయిల్‌పామ్ మొక్కలు బలంగా పెరుగుతాయన్నారు. జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా ఈనీటి గుంతలు ఏర్పాటుకు అవసరమైన తోడ్పాటును ఇస్తామన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయశాఖ సంయుక్త సంచాలకులు విజయ్‌కుమార్, జిల్లా ఉద్యాన శాఖఅధికారి మల్లిఖార్జునరావు, డ్వామా పీడీ వెంకటలక్ష్మీ, డీఆర్డీఏ పీడీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

‘పది’ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

కాకినాడ రూరల్, మే 19(ఆంధ్రజ్యోతి): పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం ప్రారంభమైనట్లు కాకినాడ జిల్లా డీఈవో పి.రమేష్ తెలిపారు. ఈనెల 28వరకూ ఈ పరీక్షలు కొనసాగనున్నాయి. జిల్లావ్యాప్తంగా 29 కేంద్రాల్లో ఉదయం 9.30గంటల నుంచి మధ్యాహ్నం 12.45గంటలవరకూ జరిగిన తెలుగు, కాంపోజిట్ తెలుగు పేపర్-1 పరీక్షలకు జిల్లాలో 1,573 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 1,193మంది హాజరుకాగా 380మంది గైర్హాజరయ్యారన్నారు.

సార్వత్రిక విద్య

సార్వత్రిక విద్య పది, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు మొదటిరోజు ప్రశాంతంగా జరిగాయి. జిల్లాలో 4కేంద్రాల్లో నిర్వహించిన ఇంటర్ సప్లిమెంటరీ ఆంగ్లం పేపర్ పరీక్షకు 464మంది విద్యార్థులకుగాను 419మంది హాజరయ్యారన్నారు. పదోతరగతి హిందీ పరీక్షకు 14 మంది విద్యార్థులు హాజరుకాగా తనిఖీ అధికారులు 3పరీక్షాకేంద్రాలను తనిఖీచేశారు.

ఏపీఈఏపీసెట్ ప్రారంభం

- ఉమ్మడి ‘తూర్పు’లో తొలి రోజు 9 కేంద్రాల్లో రెండు సెషన్లలో నిర్వహణ
- 92.03 శాతం హాజరు నమోదు: చైర్మన్ ప్రసాద్, కన్వీనర్ సుబ్బారావు

6

సదాశయంతో..

తోటి వారికి సాయపడు.. అన్నది మన సంస్కృతిలోనే ఓ భాగం. మంచి ఆశయంతో పనిచేయడం అంటే మహోపకారం చేసినట్టే. దీనికి ఆగర్భ శ్రీమంతులో, కోట్లకు పగడలెత్తినవారో కానక్కరలేదు. సాటి వారికి కాస్త సాయపడాలనే తపన ఉంటే చాలు. అదే ఎందరికో పెన్నిధి. ఇలా సదాశయంతో తమ వంతు సేవ చేయడానికి సమాజంలో ఎందరో మనకు కనిపిస్తూ ఉంటారు. ఇంత మంచి మనసు ఉన్న కొందరి పరిచయం ఇలా...



ఆంజనేయరెడ్డిని అభినందిస్తున్న మంత్రి దుర్గేష్

25 ఏళ్లుగా చలివేంద్రం.. కాకినాడలో ఏడాది పొడవునా నిర్వహణ



రాత్రి సమయంలో ప్రయాణికులకు మంచినీరు అందిస్తున్న ఆంజనేయరెడ్డి

మంచి మనసున్న చిరు వ్యాపారి!

ఆయన ఒక చిరువ్యాపారి. రోడ్డు పక్కన ప్లాస్టిక్ సామాన్లు అమ్ముకుంటూ జీవనోపాధి పొందుతూ, తాను సంపాదించిన దాంట్లో కొంత సొమ్మును సామాజిక సేవా కార్యక్రమాలకు వెచ్చిస్తున్నాడు. సేవా కార్యక్రమాలకు అవరోధంగా మారుతుందని భావించి వివాహం చేసుకోలేదు. ఏడాదిలో 365 రోజులు చలివేంద్రం నిర్వహిస్తూ రెండున్నర దశాబ్దాలుగా ప్రజల దాహార్తిని తీరుస్తున్నాడు. కాకినాడ రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీకి చెందిన అనపాల ఆంజనేయరెడ్డి రోడ్డుపక్కన ప్లాస్టిక్ సామాన్లు విక్రయిస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. తాను సంపాదించిన ఆదాయంలో సగభాగం సేవా కార్యక్రమాలకు వెచ్చిస్తున్నాడు. తొలుత 2000 ఏప్రిల్ నెలలో కాకినాడ మెయిన్‌రోడ్డులో కోటయ్య స్వీట్‌స్టాల్ పక్కన దాతల సహకారంతో స్వచ్ఛంద సంస్థ పేరుతో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశాడు. ఆ వేసవిలో రెండునెలలపాటు ఆయన మజ్జిగ, మంచినీరు, నిమ్మరసం ప్రయాణికులకు పంపిణీ చేశారు. ఇక 2001 నుంచి 2016 వరకు కాకినాడ మెయిన్‌రోడ్డుతోపాటు జీజీహెచ్ వెలుపల వరకు చలివేంద్రం నిర్వహించారు. 2017 నుంచి రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీ కనకదుర్గాదేవి ఆలయం వద్ద మెయిన్‌రోడ్డులో చలివేంద్రం నిర్వహిస్తున్నారు. ఏడాది పొడవునా చలివేంద్రం నిర్వహిస్తుండడం విశేషం. దీనికి నెలకు రూ.6 వేలు వెచ్చిస్తారు. కాకినాడ-పిఠాపురం మార్గంలో వెళ్లేవారు ఇక్కడ మంచినీరు తాగి దాహార్తిని తీర్చుకుంటున్నారు. వేసవిలో మాత్రం మజ్జిగ సరఫరా చేస్తున్నారు. ఆయన సేవలకు గుర్తింపుగా ఇటీవల మంత్రి కందుల దుర్గేష్ నుంచి ఉగాది నంది పురస్కారం అవార్డు అందుకున్నారు. ఆంజనేయరెడ్డి 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల నుంచి సిటీకి పనుల నిమిత్తం వచ్చినవారు వేసవిలో తాగునీటి కోసం పడుతున్న ఇబ్బందిని గుర్తించి తొలుత స్నేహితుల ప్రోత్సాహంతో చలివేంద్రం ఏర్పాటుచేశానని, తర్వాత నుంచి తన పేరుతో స్వచ్ఛంద సంస్థ ఏర్పాటు చేసి చలివేంద్రం నిర్వహిస్తున్నట్టు చెప్పారు.

- సర్పవరం జంక్షన్/ఆంధ్రజ్యోతి





అర్తమూరుకు చెందిన యువతికి పెళ్లికోసం సామగ్రి అందిస్తున్న జంబయ్య.. అగ్నిప్రమాదంలో సర్వం పోగొట్టుకున్న కుటుంబానికి ఆర్థిక సాయాన్ని అందిస్తున్న దృశ్యం.. తాపేశ్వరం-రామవరం పంటకాల్వపై జంబయ్య తన సొంత నిధులతో నిర్మించిన కాలిబాట వంతెన

సామాన్యుడు... దాతృత్వంలో సంపన్నుడు!

సేవా కార్యక్రమాలకు ముందుంటున్న ఉప సర్పంచ్ కర్రి జంబయ్య



గ్రామంలో వృద్ధ దంపతులకు ఇంటిని నిర్మించిన జంబయ్య

అతడో సామాన్యుడు.. కానీ ఆపన్నహస్తం అందించడంలో మనసున్న వ్యక్తి.. తన సంపాదనలో కొంత సమాజానికి కేటాయించాలన్న తలంపుతో సేవా కార్యక్రమాలు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నాడు. మండపేట మండలం అర్తమూరు గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు, గ్రామ ఉపసర్పంచ్ కర్రి సత్యనారాయణరెడ్డి(జంబయ్య) తన సొంత నిధులతో గ్రామంలో నూతనంగా నిర్మించిన షిర్డిసాయిబాబా ఆలయంలో పాలరాతి విగ్రహాన్ని అందించారు. తాపేశ్వరం నుంచి రామవరం వెళ్లే పంటకాల్వపై జంబయ్య తన సొంతనిధులు రూ.1.5లక్షలతో కాలిబాట వంతెన నిర్మించి ప్రజలు కష్టాలు తీర్చారు. గ్రామంలో అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన చిరువ్యాపారికి తన వంతుగా రూ.50 వేలు సాయం అందించి దాతృత్వం చూపారు. నిరుపేద యువతికి పెళ్లికి అవసరమైన సారె, నగదును అందించి ఉదారతను చాటుకున్నారు. ఉన్నతవిద్య చదువుకోలేని నిరుపేద విద్యార్థులకు తనవంతు సాయం అందిస్తున్నారు. అలాగే అనేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు, సేవా కార్యక్రమాల్లో ఆయన ముందు వరుసలో ఉంటున్నారు. గ్రామానికి చెందిన వృద్ధ దంపతుల ఇల్లు శిథిలావస్థకు చేరి వారిని చూసేవారు లేకపోవడంతో ఆయన తన సొంత నిధులతో వారికి ఇల్లు నిర్మించి వారి పట్ల తన ప్రేమను చాటుకున్నారు. కులమతాలకు అతీతంగా పేదల కష్టం తన కష్టంగా భావించే ఆయన ఉప సర్పంచ్‌గా, గ్రామంలో కనకదుర్గ ఆలయ కమిటీ చైర్మన్‌గా సేవలందిస్తున్నారు.

- మండపేట/ఆంధ్రజ్యోతి

అమ్మానాన్నలకు ప్రేమతో.. ఓ ఆటోడ్రైవర్!

కరపలో నాలుగేళ్లుగా చలివేంద్రం.. తల్లిదండ్రుల జ్ఞాపకార్థంగా నిర్వహణ

వేసవికాలంలో చలివేంద్రాలను ఏర్పాటు చేసి ప్రజల దాహార్తిని తీర్చడం చూస్తుంటాం. దాతల సహకారంతో కొన్నిరోజులు లేదా నెలలపాటు అవి నడుస్తుంటాయి. కాకినాడ జిల్లా కరప మండలం కరప గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ చోడపునీడి శ్రీను (నూతన్) నాలుగేళ్లుగా స్థానిక బజార్‌సెంటర్‌లో చలివేంద్రాన్ని నిర్వహిస్తూ ప్రయాణికుల దాహార్తిని తీరుస్తున్నాడు. సాధారణ మధ్యతరగతి కుటుంబానికి చెందిన శ్రీను ఆటో నడుపుకుంటూ నిర్విరామంగా చలివేంద్రాన్ని కొనసాగిస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. తన తల్లిదండ్రులు చోడపునీడి సత్తిరాజు, సత్యవతిల జ్ఞాపకార్థం కరప బజార్‌సెంటర్‌లో నాలుగేళ్లుగా ఈ చలివేంద్రాన్ని కొనసాగిస్తున్నానని, గత ఉగాది నుంచి కరప-పెనుగుదురు ప్రధాన రహదారిలో మరో చలివేంద్రాన్ని కూడా ఏర్పాటు చేశామని శ్రీను తెలిపారు. తనకెంతో సంపాదించి ఇచ్చిన తల్లిదండ్రులకు ఏమీ చేయలేకపోయానని, కనీసం వారి పేరున చలివేంద్రాలను పెట్టి కొంతైనా వారి రుణం తీర్చుకోవాలనేది అభిమతమని చెప్పారు. - కరప/ఆంధ్రజ్యోతి



కరప బజారు సెంటర్‌లో నిర్వహిస్తున్న చలివేంద్రం



నిత్యావసర వస్తువులు అందజేస్తున్న వలంటీర్లు




పథకం ప్రారంభం సందర్భంగా నిత్యావసర వస్తువులు అందచేస్తున్న పోలిశెట్టి శేఖర్

ఆపదలో ఆసరాగా..

'డొక్కాసీతమ్మ ఆసరా' పేరుతో సేవలందిస్తున్న జనసేన రామచంద్రపురం ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్

ఆపదలో ఆదుకునేవారు అరుదుగా కనిపిస్తారు.. అలాంటి సమయంలో పేద దళిత కుటుంబాలను ఆదుకోవాలనుకున్నారు జనసేన రామచంద్రపురం నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్.. కుటుంబ సభ్యులు మరణించిన ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు నెలరోజులకు సరిపడా నిత్యావసరాలు అందిస్తూ నిరుపమానసేవకు శ్రీకారం చుట్టారు.. దానికి డొక్కాసీతమ్మ ఆసరా పథకంగా నామకరణం చేశారు.. తన తల్లి, తండ్రి పేరుతో పోలిశెట్టి లక్ష్మీసుబ్బారావు మెమోరియల్ చారిటబుల్ ఫౌండేషన్ ఏర్పాటు చేసి ఈ పథకాన్ని 2023, జనవరి 1న ప్రారంభించారు. రామచంద్రపురం నియోజకవర్గంలో కాజులూరు, కె.గంగవరం, రామచంద్రపురం పట్టణం, మండలంలో ఎస్సీ, ఎస్టీ కుటుంబాల్లో ఐదేళ్ల వయస్సు పైబడి ఎవరు మరణించినా వారి కుటుంబానికి నెలరోజులకు సరిపడా 26 కిలోల బియ్యం, కందిపప్పు,నూనె, పంచదార, మినపప్పు, పెసరపప్పు, టీపొడి, ఇడ్లీరవ్వ, కరాచీ రవ్వ, మసాలా దినుసులతో 10 రకాల కిరాణా సరుకులు, 10 కిలోల కూరగాయలు అందజేస్తున్నారు. ఎస్సీ, ఎస్టీ కుటుంబాల్లో మరణించిన వారి కుటుంబాల వివరాలు వలంటీర్ల ద్వారా సేకరిస్తారు. ప్రతి బుధవారం కుటుంబాన్ని పరామర్శించి నిత్యావసర సరుకులు అందజేస్తున్నారు. ఇప్పటి వరకు రామచంద్రపురం నియోజకవర్గంలో 1400 కుటుంబాలకు నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ పథకానికి నియోజకవర్గ ట్రస్టు కోఆర్డినేటర్‌గా తోటపేట శివారు గాంధీనగర్‌కు చెందిన గుబ్బల శ్రీనివాసరావు పనిచేస్తున్నారు. పోలిశెట్టి లక్ష్మీ సుబ్బారావు మెమోరియల్ చారిటబుల్ ఫౌండేషన్ చైర్మన్ పోలిశెట్టి చంద్రశేఖర్ మాట్లాడుతూ తన తల్లి పోలిశెట్టి లక్ష్మీకాంతానికి ఆకలిగా ఉన్నవారిని ఆదుకోవడం, తండ్రి సుబ్బారావుకు కష్టపడే తత్వం ఉండేదన్నారు. వారి ప్రభావంతోపాటు అభిమాన నటులు చిరంజీవి, పవన్‌కల్యాణ్ సేవలు స్ఫూర్తిగా నిలిచాయని, కొంతైనా పేదలకు సాయం చేయాలని నిత్యావసరాలు అందజేస్తున్నట్టు చెప్పారు. తన సోదరుడు ఫౌండేషన్ వైస్‌చైర్మన్ పోలిశెట్టి శ్రీనివాసరావు, కుటుంబ సభ్యులు సహకారం అందిస్తున్నారన్నారు. - ద్రాక్షారామ/ఆంధ్రజ్యోతి



సెట్ కోడ్ విడుదల చేస్తున్న ఏపీఈఏపీసెట్ చైర్మన్, ఉప కులపతి సీఎస్ఆర్కే ప్రసాద్

ఏపీఈఏపీసెట్ ప్రారంభం

ఉమ్మడి 'తూర్పు'లో తొలి రోజు 9 కేంద్రాల్లో రెండు సెషన్లలో నిర్వహణ

92.03 శాతం హాజరు నమోదు: చైర్మన్ ప్రసాద్, కన్వీనర్ సుబ్బారావు వెల్లడి

జేఎన్టీయూకే, మే 19 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జేఎన్టీయూ ఆధ్వర్యంలో ఏపీఈఏపీసెట్ సోమవారం ప్రారంభమైంది. తొలి రోజు అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్ష కాకినాడ, తూర్పు గోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లో ప్రశాంతంగా జరిగిందని ఏపీఈఏపీసెట్ చైర్మన్, జేఎన్టీయూకే ఉప కులపతి సీఎస్ఆర్కే ప్రసాద్ తెలిపారు. కన్వీనర్ వీవీ సుబ్బారావు, సహ కన్వీనర్లు, కో-ఆర్డినేటర్లు, టీసీఎస్, ఏపీ ఆన్‌లైన్ అధికారులతో కలిసి వీసీ ప్రసాద్ అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్ష సెట్ కోడ్‌ను వర్సిటీలోని ఈఏపీసెట్ కార్యాలయంలో విడుదల చేశారు. అనంతరం పరీక్ష నిర్వహణ తీరును పరిశీలించారు. మూడు జిల్లాల్లోని 9 కేంద్రాల్లో రెండు సెషన్లలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు ఆన్‌లైన్‌లో పరీక్ష నిర్వహించారు.

- కాకినాడ జిల్లాలోని ఐదు కేంద్రాల్లో ఉదయం నిర్వహించిన పరీక్షకు 922 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 844 మంది హాజరు కాగా 78 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షకు 923 మంది విద్యార్థులకు 869 మంది హాజరు కాగా 54 మంది పరీక్ష రాయలేదు. మొత్తం రెండు సెషన్లకు కలిపి 1,845 మందికి 1,713 మంది హాజరు కాగా 132 మంది గైర్హాజరయ్యారు. 92.85 శాతం హాజరు నమోదైంది.
- తూర్పు గోదావరి జిల్లాలోని రెండు కేంద్రాల్లో రెండు సెషన్లకు కలిపి మొత్తం 1,300 మంది అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా 1,204 మంది హాజరుకాగా 96 మంది గైర్హాజరయ్యారు. 92.65 శాతం నమోదైంది.
- డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని రెండు కేంద్రాల్లో రెండు సెషన్లలో నిర్వహించిన అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షకు 803 మంది విద్యార్థులకు 759 మంది హాజరయ్యారు. 44 మంది పరీక్ష రాయలేదని తెలిపారు. 94.52 శాతం హాజరు నమోదైంది. మంగళవారం కూడా అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షలు జరుగుతాయని కన్వీనర్ వీవీ సుబ్బారావు తెలిపారు.



ఈవోకు బంగారు పంచపాత్రలు, వెండి పళ్లెం సమర్పిస్తున్న దాతలు

వాడపల్లి వెంకన్నకు రూ.22 లక్షల విలువైన బంగారు వస్తువుల సమర్పణ

ఆత్రేయపురం, మే 19 (ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామికి దాతలు రూ..22 లక్షలు విలువైన బంగారు వస్తువులను సమర్పించారు. కొత్తపేట మాజీ ఎమ్మెల్యే మంతెన సుబ్బరాజు వంశవారసులు వెంకటకృష్ణంరాజు-దుర్గావతి దంపతుల కుమారుడు వెంకటసూర్యసుబ్బరాజు-శ్వేత దంపతులు స్వామివారికి 209.84 గ్రాములతో బంగారు పంచపాత్రలు, 318.84 గ్రాములతో వెండి పళ్లెం చేయించారు. సోమవారం వాటిని ఉప కమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావుకు అందచేశారు. సంప్రోక్షణ అనంతరం స్వామివారి సేవకు వినియోగించారు. దాతలకు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికి వేదపండితులు ఆశీర్వచనం ఇచ్చారు. స్వామి వారి చిత్రపటం, తీర్థప్రసాదాలు దాత కుటుంబ సభ్యులకు అందజేశారు.





సాధించిన బంగారు పతకాన్ని కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్‌కు చూపిస్తున్న లోవరాజు

ఉషు జాతీయ స్థాయి పోటీలకు లోవరాజు ఎంపిక

కరప, మే 19 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కరప మండలం జి.బావారం గ్రామానికి చెందిన యు.లోవరాజు జాతీయ స్థాయి ఉషు పోటీలకు ఎంపికైనట్టు ఉషు క్రీడ జిల్లా కార్యదర్శి ఆర్.సుందరం తెలిపారు. కర్నూలు జిల్లాలో ఈ నెల 12 నుంచి మూడు రోజుల పాటు జరిగిన 12వ రాష్ట్ర ఉషు చాంపియన్‌షిప్ సీనియర్స్ విభాగంలో లోవరాజు 80 కేజీల విభాగంలో బంగారు పతకం సాధించాడు. ప్రతిభ కనబరిచిన అతడు త్వరలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా లోవరాజు సోమవారం కలెక్టర్ షాన్‌మోహన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి బంగారు పతకం చూపించగా ఆయన అభినందించారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన లోవరాజును జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఆఫీసర్ బి.శ్రీనువాసకుమార్, రాష్ట్ర ఉషు కార్యదర్శి బి.నరసింహరావు, జి.బావారం సర్పంచ్ రొక్కాల గణేష్, ఉప సర్పంచ్ వై.రామకృష్ణ, యండమూరు స్కూల్ కమిటీ చైర్మన్ పి.శ్రీనివాస్ అభినందించారు.

22న హనుమాన్ శోభాయాత్ర బైక్ ర్యాలీ

సామర్లకోట, మే 19 (ఆంధ్రజ్యోతి): హనుమాన్ శోభాయాత్ర కమిటీ సామర్లకోట-పెద్దాపురం పట్టణ శాఖల ఆధ్వర్యంలో ఈ నెల 22న హనుమాన్ శోభాయాత్ర పేరిట భారీ బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్టు శోభాయాత్ర కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఆ రోజు సాయంత్రం నాలుగు గంటలకు సామర్లకోట ప్రసన్నాంజనేయస్వామి విగ్రహం వద్ద ప్రారంభమయ్యే ర్యాలీ సామర్లకోట, పెద్దాపురం వీధుల్లో కొనసాగుతుంది. శృంగవృక్షం దత్త పీఠాధిపతి శ్రీసాయిదత్త నాగానంద సరస్వతి స్వామీజీ ముఖ్య అతిథిగా హాజరై భక్తులకు అనుగ్రహభాషణ చేస్తారన్నారు.

నాడు...



ఆపద తొలగింది!

కాకినాడలోని కొండయ్యపాలెం బ్రిడ్జి వద్ద అపార్ట్‌మెంట్ల సమీపంలో విద్యుత్ స్తంభానికి ఓ మొక్క పాదులా అల్లుకుంది. దీంతో విద్యుత్ ప్రమాదం పొంచి ఉందంటూ ఈ నెల 10న 'ఆంధ్రజ్యోతి'లో చిత్రం వచ్చింది. దీనికి అధికారులు స్పందించి సోమవారం ఆ మొక్కను తొలగించారు.

- ఫొటోగ్రాఫర్, కాకినాడ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నేడు...





కాకినాడ డీఆర్వో వెంకట్రావుకు వినతిపత్రం ఇస్తున్న వెంకటరామానాయుడు-సత్యవతి దంపతులు

'కబ్జాదారుల చెర నుంచి మా స్థలాలను విడిపించండి'

కాకినాడ/కలెక్టరేట్, మే 19 (ఆంధ్రజ్యోతి): కాకినాడ గైగోలుపాడులోని తమ స్థలాలను వైసీపీ నాయకులు కబ్జా చేశారని, వారి చెర నుంచి విడిపించాలని ఎయిర్‌ఫోర్స్ విశ్రాంత ఉద్యోగి, తూర్పు గోదావరి జిల్లా దివాన్ చెరువుకు చెందిన కొత్తపల్లి వెంకటరామానాయుడు-సత్యవతి దంపతులు కాకినాడ జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో విన్నవించారు. తాను ఉద్యోగంలో ఉండగా 350 గజాల చొప్పున కొనుగోలు చేసిన రెండు స్థలాలు ఆక్రమణకు గురవ్వడంపై డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేశ్, కాకినాడ రూరల్, సిటీ ఎమ్మెల్యేలు పంతం నానాజీ, వనమాడి వెంకటేశ్వరరావులను కలిసి వివరించామన్నారు. సోమవారం కాకినాడ ఎస్పీ బిందుమాధవ్‌తో పాటు కలెక్టరేట్‌లో రెవెన్యూ అధికారి వెంకట్రావుకు వినతిపత్రాలు అందజేశామని వివరించారు. కాగా ఈ వ్యవహారంపై కలెక్టర్ షాన్‌మోహన్ స్పందించి విచారణకు ఆదేశించారు. కబ్జాకు గురైన స్థలాన్ని కాకినాడ ఆర్డీవో మల్లిబాబు, కాకినాడ అర్బన్ తహసీల్దార్ జితేంద్ర సోమవారం రాత్రి పరిశీలించారు.

వచ్చేస్తోంది.. మరో హై..వే!

- ఖమ్మం నుంచి దేవరపల్లి ఎన్‌హెచ్‌-365 బీజీ
- జూన్‌ నాటికి పూర్తిచేయాలని ప్లాన్‌
- ఇప్పటికే దేవరపల్లి వద్ద టోల్‌ప్లాజా సిద్ధం
- పొంగుటూరు వద్ద 11 హెక్టార్ల భూ సమస్య
- దగ్గర దారికి కోర్టు అడ్డంకి
- 3 కి.మీ మేర ఆగిన పనులు
- ఆగస్టు 15న ప్రారంభించే ఆలోచన


దేవరపల్లి వద్ద సిద్ధం చేసిన టోల్‌ప్లాజా

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

మరో కొత్త జాతీయ రహదారి వస్తోంది.. కేవలం ప్రారంభానికి మూడు కిలోమీటర్ల దూరంలోనే ఉంది. అయితే చిన్న సమస్య కారణంగా నేటికీ ఆరంభానికి నోచుకోలేదు.. ఆ సమస్య పరిష్కారమైతే విజయవాడ వెళ్లినంత ఈజీగా హైదరాబాద్‌కు వెళ్లవచ్చు. ఖమ్మం నుంచి దేవరపల్లి మండలంలోని దేచర్ల వరకూ భారత మాల ఆర్థిక నడవా పథకం కింద నాలుగు వరుసల జాతీయ రహదారి(ఎన్‌హెచ్‌)- 365జీబీ పేరుతో ఓ గ్రీన్‌మార్గం నిర్మాణం అవుతోంది. రహదారి పనులు చాలా వేగంగా జరుగుతున్నాయి. జూన్‌ నాటికి ఇది పూర్తవుతాయని అధికారులు చెబుతున్నారు. ఆగస్టులో ఈ జాతీయ రహదారిని జాతికి అంకితం చేయాలనే ఆలోచనతో ఉన్నారు. ఇంత పెద్ద జాతీయ రహదారికి కేవలం మూడు కిలోమీటర్ల మేర 11 హెక్టార్ల భూసేకరణ వివాదంగా మారింది. సదరు భూయజమానులు కోర్టును ఆశ్రయించడంతో అక్కడ వివాదం కొనసాగుతోంది. ఈ మూడు కిలోమీటర్ల మేర తప్ప మిగతా హైవే నిర్మాణం సుమారుగా పూర్తయినట్టే. హైదరాబాద్‌ నుంచి విశాఖ, కలకత్తా వైపు వెళ్లేవారు విజయవాడ మీదగా వెళ్లాంటే 670 కిలోమీటర్లు హైవేలో 12 గంటల ప్రయాణించాల్సి వస్తుంది. చాలా మంది ఖమ్మం మీదగా కొవ్వూరు- రాజమహేంద్రవరం ఫోర్త్‌ బ్రిడ్జి మీదగా దగ్గర దారి కోసం పయనిస్తూ ఉంటారు. ప్రస్తుతం గుండుగొలను, నల్లజర్ల, కొవ్వూరు మీదుగా వెళ్లడం వల్ల కొంత దూరం తగ్గింది. ఖమ్మం నుంచి రావడం వల్ల మరింత దూరం తగ్గుతుంది. కేవలం 550 కిలోమీటర్ల మేర పయనిస్తే ఎనిమిది గంటల్లో హైదరాబాద్‌ చేరుకోవచ్చు.దీనికోసం ఖమ్మం నుంచి దేవరపల్లి మండలంలోని దేచర్ల వరకూ 165 కిలోమీటర్ల మేర నాలుగు వరుసల జాతీయ రహదారిని భారతమాల ఆర్థిక నడవా పథకం కింద ఎన్‌హెచ్‌ -365జీబీ పేరుతో నిర్మిస్తున్నారు. దీనివల్ల హైదరాబాద్‌ విశాఖపట్నం మధ్య 120 కిలోమీటర్ల దూరం తగ్గిపోతుంది. సుమారు రూ.3,573 కోట్ల ఖర్చుతో 165 కిలోమీటర్ల మేర దీనిని నిర్మిస్తున్నారు. తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాల్లో ఐదు ప్రాజెక్టుల కింద పనిజరుగుతుంది. 117 అండర్‌ పాసులు, 33 కల్వర్టులు, 9 భారీ వంతెనలు నిర్మాణం వేగంగా జరుగుతున్నాయి. దేవరపల్లి వద్ద టోల్‌ప్లాజా కూడా ఏర్పాటు చేశారు. ఖమ్మం నుంచి దేవరపల్లి వరకూ కేవలం కొయ్యలగూడెం పరిధిలోని పొంగుటూరులో మూడు కిలోమీటర్ల మేర తప్ప, మిగతా హైవే అంతా సుమారుగా పూర్తయిపోయింది.

కోర్టు సమస్య త్వరగా పరిష్కరించాలి..

మంచి పనులకు కూడా కొన్ని సమస్యలు వస్తుంటాయి. అలాంటపుడు ప్రభుత్వం, అధికారులు సీరియస్‌గా తీసుకుని వాటిని పరిష్కరించి ముందుకు సాగాలి. ప్రజాప్రతినిధులు కూడా స్థానికంగా ఇటువంటి సమస్యలు పరిష్కరించడంపై దృష్టిపెట్టాలి. కొయ్యలగూడెం సమీపంలోని పొంగుటూరుప్రాంతంలో మూడు కిలోమీటర్ల మేర 11 హెక్టార్ల భూ సేకరణ సమస్య కోర్టులో ఉంది. కోర్టు తీర్పు రిజర్వులో ఉన్నట్టు అధికారుల కథనం. ఈ తీర్పు వెలువడితేనే ఈ మూడు కిలోమీటర్ల మేర హైవే పనులు ఆరంభమవుతాయి. ఆగస్టు 15లోపు పూర్తి చేయాలనే ఆలోచనతో ఉన్నా అది సాధ్యపడేదిగా కనిపించడంలేదు. కోర్టు అనుమతి ఇవ్వాలి. భూసేకరణ ప్రక్రియ పూర్తికావాలి. పనులు చేపట్టాలి. మూడు కిలోమీటర్ల మేర నాలుగు వరసల హైవే నిర్మాణం అంటే కొంత సమయం పడుతుంది. ఇక ఆగస్టు అంటే కేవలం మూడునెలలు మాత్రమే సమయం ఉంది. కాని యంత్రాంగం ఈ పనులు త్వరగా పూర్తి చేసేలా ప్రయత్నం చేయవలసిందే. మూడు కిలోమీటర్ల మేర ఏర్పడిన సమస్యను యుద్ధ ప్రాతిపదికను పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఇండియన్‌ ఫారెస్టు సర్వీస్‌కు లవకుమార్‌ ఎంపిక



రౌతులపూడి, మే 19 (ఆంధ్రజ్యోతి): రౌతులపూడి మండలం మూలగపూడి గ్రామానికి చెందిన చింతకాయల లవకుమార్‌ ఇండియన్‌ ఫారెస్టు సర్వీస్‌కు ఎంపికయ్యాడు. ఆల్‌ ఇండియాలో 49 ర్యాంకు సాధించాడు. పశువైద్యుడిగా పనిచేస్తూ మొదటిసారి సివిల్స్‌ పరీక్షలు రాసి విఫలం కాగా, రెండో ప్రయత్నం 2024లో పరీక్షకు హాజరై విజయం సాధించాడు. చింతకాయల వీర చక్రవర్తి, వీరవరహాలు దంపతులకు ఒక అమ్మాయి, ఒక అబ్బాయి. ఈయన తల్లిదండ్రులు వ్యవసాయం చేస్తుంటారు. లవకుమార్‌ పశువైద్యుడిగా పనిచేస్తూ నర్సీపట్నంలో నివాసముంటున్నాడు. ఎటువంటి కోచింగ్‌ లేకుండానే విజయం సాధించినట్టు ఆయన తెలిపాడు. ఈ సందర్భంగా లవకుమార్‌ను ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, తదితరులు అభినందించారు.

చికిత్స పొందుతూ ...

టీడీపీ నేత సుబ్రహ్మణ్యం మృతి

- సంతాపం తెలిపిన పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్‌ఎన్‌ వర్మ


సుబ్రహ్మణ్యం మృతదేహంపై టీడీపీ జెండా కప్పుతున్న మాజీ ఎమ్మెల్యే వర్మ



పిఠాపురం రూరల్‌, మే 19 (ఆంధ్రజ్యోతి): రోడ్డుప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కాకినాడ జిల్లా పిఠాపురం మండలం మల్లాం అంబేడ్కర్‌ యువజన సంఘం అధ్యక్షుడు, టీడీపీ నేత ఎద్దు సుబ్రహ్మణ్యం (35) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. ఈనెల 16వ తేదీ రాత్రి తన బైక్‌పై సుబ్రహ్మణ్యం ఇంటికి వస్తుండగా జల్లూరు సమీపంలో అదుపు తప్పి తీవ్రగాయాలపాలైనట్టు పోలీసులు చెబుతున్నారు. దీంతో అతడిని చికిత్స నిమిత్తం కాకినాడలోని ఓ ప్రైవేట్‌ ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మరణించాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. పిఠాపురం రూరల్‌ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఇతనికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈయన మృతిపై పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్‌ఎన్‌ వర్మ సంతాపం ప్రకటించి, పార్థివదేహంపై టీడీపీ జెండాను కప్పారు.

గోదావరిలో స్నానానికి దిగి యువకుడి మృతి


గాడి రాకేష్‌ మృతదేహం

కొవ్వూరు, మే 19 (ఆంధ్రజ్యోతి): గోదావరిలో స్నానానికి వెళ్లి యువకుడు మృతి చెందిన సంఘటన కొవ్వూరు మండలం సీతంపేటలో సోమవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్లితే చాగల్లు మండలం దారవరం గ్రామానికి చెందిన గాడి రాకేష్‌ (17) తన స్నేహితుడితో కలిసి గోదావరిలో స్నానానికి వెళ్లాడు. అయితే నది లోతు ఎక్కువగా ఉండడంతో ప్రమాదవశాత్తు అందులో మునిగిపోయాడు. తర్వాత తేలడంతో నిడదవోలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు ధృవీకరించారు. ఆసుపత్రి సమాచారం మేరకు కొవ్వూరు రూరల్‌ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ శ్రీహరిరావు తెలిపారు.

దిక్కుతోచని స్థితిలో...

వైట్‌బర్లీ పొగాకు రైతులు

- కొనేవారు లేక ఎదురుచూపు
- మొహం చాటేసిన కంపెనీ అధికారులు


భీమోలులో పంటను చూపుతున్న రైతులు

గోపాలపురం, మే19(ఆంధ్రజ్యోతి): గోపాలపురం మండలంలో వైట్‌బర్లీ పొగాకు రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. కొనుగోలుదారుల మాయలోపడి భీమోలు, కరగపాడులో దాదాపు 100 ఎకరాల్లో పంటను సాగుచేశారు. నాట్లు దశలో కొనుగోలు చేస్తామని కంపెనీ ప్రతినిధులు నమ్మబలికారు. అంతేకాకుండా సాగుకు అవసరమయ్యే మందులను కూడా సరఫరా చేశారు.తీరా పంటపూర్తై చేతికి అందివచ్చే తరుణంలో మాట మార్చి కొనుగోలు చేసేందుకు నిరాకరించారు. దీంతో వారంతా దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. అధిక మొత్తం పెట్టుబడి పెట్టగా, ప్రస్తుతం కొనేవారులేక అయోమయంలో పడ్డారు. నాట్లుదశలో కిలో రూ.150కి కొనుగోలు చేస్తామని చెప్పి, ఇప్పుడేమో నాణ్యతను బట్టి రూ. 120-150కి కొనుగోలు చేస్తామని చెబుతుండడంతో రైతులు కంగుతిన్నారు. దీంతో భీమోలులోని రైతులు నిరసన వ్యక్తం చేశారు.

వ్యభిచార గృహంపై దాడి

- పోలీసుల అదుపులో ఇద్దరు మగవాళ్లు , ముగ్గురు మహిళలు


వివరాలు వెల్లడిస్తున్న దేవరపల్లి సీఐ నాగేశ్వర్‌ నాయక్‌

దేవరపల్లి, మే 19(ఆంధ్రజ్యోతి): వ్యభిచార గృహంపై దాడి చేసి ఇద్దరు మగ, ముగ్గురు మహిళలను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి ఫోన్లు, మారుతి బ్రిడ్జ్‌ కారును స్వాధీనం చేసుకున్నట్టు దేవరపల్లి సీఐ బీ.నాగేశ్వర్‌నాయక్‌ పేర్కొన్నారు. దేవరపల్లి సర్కిల్‌ ఇన్‌స్పెక్టర్‌ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులకు వివరాలు వెల్లడిస్తూ... దేవరపల్లిలోని మారుతీనగర్‌లో పెనుగొండ జోగేశ్వరరావు అనే వ్యక్తి ఇంటిలో వ్యభిచారం జరుగుతుందన్న ముందస్తు సమాచారం మేరకు తాను, ఎస్సై వీ.సుబ్రహ్మణ్యం, సిబ్బంది, వీఆర్వోలను తీసుకుని వెళ్లి సోదాలు నిర్వహించగా, ఇద్దరు మగ, ముగ్గురు మహిళలు ఉన్నట్టు గుర్తించామన్నారు. ఈ క్రమంలో వారిని అదుపులోకి తీసుకుని విచారించగా గత కొంతకాలంగా గోపాలపురం మండలం చిట్యాలకి చెందిన జుట్టా బేబీ, దుద్దుకూరుకి చెందిన సిర్రా రవి మహిళలకు వల వేసి వారిని వ్యభిచార కూపంలోకి దింపుతూ, దాంతో వచ్చిన సంపాదనతో విలాసవంతంగా గడుపుతున్నారన్నారు. ఈ కేసులో వ్యభిచార కేంద్రం నిర్వహిస్తున్న బేబీ, రవి, విటుడు ఏలూరుకు చెందిన కొళ్ల రవితేజను వ్యభిచారం నేరం కింద అరెస్టు చేసి జ్యూడిషియల్‌ రిమాండ్‌కు పంపుతున్నట్టు చెప్పారు. అలాగే వ్యభిచార గృహంలో దొరికిన ఇద్దరు బాధిత మహిళలను ఏపీ స్టేట్‌ హోమ్‌కు పంపించేందుకు కోర్టు అనుమతి కోరుతున్నామని సీఐ పేర్కొన్నారు.

భార్యను వేధిస్తున్న భర్తపై కేసు

ఆత్రేయపురం, మే 19(ఆంధ్రజ్యోతి): భార్యను వేధిస్తున్న భర్తపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆత్రేయపురం ఎస్‌ఐ ఎస్‌.రాము తెలిపారు. వాడపల్లికి చెందిన పెద్దింటి అనురాధకు అదే గ్రామానికి చెందిన సుబ్రహ్మణ్యంతో 17ఏళ్ల క్రితం వివాహమైంది. వారికి ఇద్దరు కుమార్తెలు. కొంతకాలంగా సుబ్రహ్మణ్యం భార్యను అదనపు కట్నం తేవాలంటూ తరచూ వేధిస్తున్నాడు. ఇంటి నుంచి బయటకు గెంటివెయ్యడంతో అనురాధ పుట్టింటికి వెళ్లి కుటుంబ సభ్యుల సహకారంతో సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ రాము తెలిపారు.

పిఠాపురంలో ఇరువర్గాల ఘర్షణ

ఆరుగురికి తీవ్ర గాయాలు.. ఆసుపత్రికి తరలింపు

పిఠాపురం, మే 19 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురంలో సోమవారం సాయంత్రం రెండు వర్గాల మధ్య జరిగిన ఘర్షణలో ఆరుగురికి గాయాలయ్యాయి. ఇందిరానగర్‌ ప్రాంతానికి చెందిన మిరియాల సూర్యకుమారి ఇంటిని ఇటీవల అధికారులు కూల్చివేశారు. ఈ విషయంపై ఇంటి ఎదురుగా ఉన్న కొల్లి సత్తిబాబు, అతడి కుటుంబసభ్యులు, సూర్యకుమారి కుటుంబసభ్యుల మధ్య వివాదం చోటుచేసుకుంది. వివాదం ముదిరి ఇరువర్గాలు పరస్పరం దాడులు చేసుకున్నారు. ఈ ఘటనలో ఒక వర్గానికి చెందిన ముగ్గురు, మరో వర్గానికి చెందిన ముగ్గురికి గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పిఠాపురం పట్టణ పోలీసులు ఇరువర్గాల నుంచి స్టేట్‌మెంట్లు రికార్డు చేసుకున్నారు.

వేర్వేరు చోట్ల ఇద్దరు అదృశ్యం

రాజమహేంద్రవరం సిటీ, మే 19(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో వేర్వేరు ప్రాంతాలకు చెందిన ఇద్దరు అదృశ్యమయ్యారని పోలీసులు తెలిపారు. బొమ్మూరు పోలీసుల కథనం ప్రకారం వివరాల్లోకి వెళితే.. స్థానిక సావిత్రి నగర్‌కు చెందిన ఓ వివాహిత తన ఇద్దరు పిల్లలను తీసుకుని ఈనెల 18వ తేదీ ఉదయం 11గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లింది. తిరిగి రాకపోవడం, బంధువుల ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో ఆమె భర్త బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నారు. అలాగే స్థానిక కంబాలపేటకు చెందిన ఎస్‌.భీమరాజు అనే మెకానిక్‌ నెల 16న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. అతడి ఆచూకీ లభించకపోవడంతో భార్య ప్రియదర్శిని ఇచ్చిన ఫిర్యాదు మేరకు త్రీటౌన్‌ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఐబీఎంతో జీజీయూ ఎంవోయూ


ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న దృశ్యం

రాజానగరం, మే 19(ఆంధ్రజ్యోతి): గోదావరి గ్లోబల్‌ విశ్వవిద్యాలయం(జీజీయూ), ప్రపంచ ఐటీ దిగ్గజ సంస్థ ఐబీఎంతో అవగాహన ఒప్పందం(ఎంవోయూ)చేసుకున్నట్టు జీజీయూ ప్రోచాన్సలర్‌ కె.శశికిరణ్‌ వర్మ తెలిపారు. ఐబీఎం ఇన్నోవేషన్‌ సెంటర్‌ ఫర్‌ ఎడ్యుకేషన్‌ బిజినెస్‌ డెవలప్‌మెంట్‌ అండ్‌ క్లైంట్‌ రిలేషన్‌షిప్‌ లీడర్‌ హరిరామ సుబ్రహ్మణియన్‌, డెలివరీ హెడ్‌ వికారుద్దీన్‌తో కలిసి సోమవారం జీజీయూ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎం వోయూ కారణంగా భవిష్యత్తులో జీజీయూ, ఐబీఎం మధ్య విద్యా సహకారం అనే థీమ్‌ కింద అర్టిఫిషియల్‌ ఇంటెలిజెన్స్‌, మెషీన్‌ లెర్నింగ్‌ అండ్‌ డేటా సైన్స్‌ ప్రోగ్రాం ప్రారంభాన్ని సూచిస్తుందన్నారు. ఐబీఎం ఉభయ తెలుగు రాష్ట్రాల్లో జీజీయూతోనే ఎంవోయూ చేసుకుందన్నారు. ఈ రెండూ ఉమ్మడిగా కోర్సులను అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో బోధిస్తుందని, విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌, లైవ్‌ ప్రాజెక్టు, ఉద్యోగాలు పొందే అవకాశం ఉంటుందన్నారు. దీనిలో భాగంగా జీజీయూ ఐబీఎం అధికారులు పరస్పరం ఎంవోయూ పత్రాలను మార్చుకున్నారు. సమావేశంలో జీజీయూ వైస్‌ ఛాన్సలర్‌ యు.చంద్రశేఖర్‌, ప్రోఛాన్సలర్‌ కేవీబీ రాజు, రిజిస్ట్రార్‌ పీఎంఎంఎస్‌ శర్మ, డైరెక్టర్‌ ఎం.శ్రీనివాసరావు, ది ఫర్నల్‌ స్టోరీ సంస్థ వ్యవస్థాపకుడు, ఎండీ సుమంత్‌ పాలేపు పాల్గొన్నారు.

ఉద్యాన పరిశోధన కేంద్రం అధిపతిగా ముత్యాలనాయుడు


ముత్యాలనాయుడును కలిసిన స్థానిక శాస్త్రవేత్తలు

అంబాజీపేట, మే 19(ఆంధ్రజ్యోతి): డాక్టర్‌ బీఆర్‌ అంబేడర్‌ కోనసీమ జిల్లా అంబాజీపేట డాక్టర్‌ వైఎస్సార్‌ ఉద్యాన పరిశోధన కేంద్రం అధిపతిగా డాక్టర్‌ ఎం.ముత్యాలనాయుడు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకూ పనిచేసిన అధిపతి డాక్టర్‌ ఎన్‌బీవీ చలపతిరావు వెంకటరామన్నగూడెం వైఎస్సార్‌ ఉద్యాన సమాచార కేంద్రానికి బదిలీ అయ్యారు. దీంతో కర్నూలు జిల్లా నంద్యాలలోని మహానంది ఉద్యాన పరిశోధన కేంద్రం ఉద్యాన పరిశోధన కేంద్రం నుంచి ముత్యాలనాయుడు బదిలీపై అంబాజీపేట వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు అందుబాటులో ఉంటూ పంటలలో వచ్చే సమస్యలను పరిష్కరించేందుకు కృషిచేస్తానన్నారు. కొబ్బరిని ఆశించి నష్టాన్ని కలుగ చేస్తున్న తెల్లదోమ నివారణకు చర్యలు తీసుకుంటానన్నారు. ఈ సందర్భంగా ముత్యాలనాయుడును స్థానిక శాస్త్రవేత్తలు గోవర్ధనరావు, కిరిటీ, నీరజ, అనూష, సిబ్బంది మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి




మృతుడు గంధం నాగేశ్వరరావు, ఫైల్‌ఫొటో

కొత్తపేట, మే 19(ఆంధ్రజ్యోతి): డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ కోనసమీ జిల్లా కొత్తపేట పాతబస్టాండ్‌ సెంటర్లో ఆర్టీసీ బస్సు వ్యక్తిని నేరుగా ఢీకొట్టడంతో అక్కడిక్కడే మృతిచెందిన్నట్టు ఎస్‌ఐ జి.సురేంద్ర తెలిపారు. వాడపాలేనికి చెందిన గంధం నాగేశ్వరరావు(37) బంధువుల ఇంట పెళ్లికి కొత్తపేట బస్టాండ్‌ సమీపంలో ఉన్న హరిహర దేవాలయ ప్రాంగణానికి వెళ్లాడు. ఆదివారం రాత్రి 11గంటల సమయంలో అమలాపురం నుంచి రావులపాలెం వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు వేగంగా నాగేశ్వరరావును ఢీకొట్టడంతో అక్కడిక్కడే మృతిచెందాడు. ఈ మేరకు మృతుడు భార్య గంధం దుర్గ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ సురేంద్ర తెలిపారు. కాగా కుటుంబాన్ని పోషించే భర్త ఇలా రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో భార్య దుర్గ విలపించిన తీరు అందర్ని కలిచివేసింది.

అనపర్తిలో ఆటోను ఢీకొన్న బైక్‌

ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలు


ప్రమాదంలో గాయపడ్డ యువకులు

అనపర్తి, మే 19(ఆంధ్రజ్యోతి): అనపర్తిలోని కుమ్మరి వీధిలో సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు తీవ్ర గాయాలపాలయ్యారు. ఎస్‌ఐ శ్రీను నాయక్‌ తెలిపిన వివరాల ప్రకారం.. అనపర్తి మండలం పీరా రామచంద్రపురం గ్రామానికి చెందిన లంక మనోహర్‌, కోడి ప్రదీప్‌ అనపర్తిలోని పాత హరిజన పేటలో తమ బంధువుల ఇంటికి మోటార్‌సైకిల్‌పై వచ్చారు. తిరుగు ప్రయాణమైన వీరు కుమ్మరి వీధిలో ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొని రోడ్డుపై పడ్డారు. ఈ ప్రమాదంలో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. వారిని స్థానికులు స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించగా అక్కడ ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

సారా తరలిస్తున్న ఇద్దరి అరెస్టు

రాజమహేంద్రవరం సిటీ, మే 19(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో సారాను తరలిస్తున్న ఇద్దరి అరెస్టు చేసినట్టు త్రీటౌన్‌ పోలీసులు తెలిపారు. రాజమహేంద్రవరం సంజీవయ్యనగర్‌ సమీపంలో సోమవారం 10లీటర్ల సారాతో వెళ్తున్న పి.జోసెఫ్‌ను, మూలగొయ్యి సమీపంలో 10లీటర్ల సారాతో వెళ్తున్న కె.ప్రసాద్‌ను త్రీటౌన్‌ పోలీసులు పట్టుకున్నారు. వారిని అరెస్టు చేసి 20లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్టు పోలీసులు తెలిపారు.

మురికిని మురుకుతోనే..



ముల్లును ముల్లుతోనే తీయాలనే నానుడి అందరికీ తెలిసే ఉంటుంది. ఇక్కడ ఉన్న ఫొటోలకు ఈ నానుడి సరిగ్గా సరిపోతుంది అనుకుంటా.. పవిత్రమైన గోదావరి నది కాలుష్యం బారిన పడుతోంది. పుణ్య స్నానాలకు వచ్చిన భక్తులు విడిచిన బట్టలు, ఇతర వ్యర్థాలతో కలుషితం అవుతోంది. అయినా పట్టించుకునే నాథుడే లేడు. ఇదిలా ఉంటే ఇక్కడ బట్టలు ఉతికే ఆవిడను చూడండి! మురికి పట్టిన బట్టలను తెచ్చి మురికి నీళ్లలో ముంచి, బండకేసి బాది, గట్టిగా పిండి ఎండలో ఆరబెట్టింది. చివరి ఫొటోను చూశారా! ఎండలో ఆరబెట్టిన బట్టలు ఎలా తలతలా మెరిసిపోతున్నాయో! ముల్లును ముల్లుతోనే తీయాలన్నట్టు.. మురికిని మురికితోనే పోగొట్టాలనుకుంటా!

-ఫొటోగ్రాఫర్‌, రాజమహేంద్రవరం.

కాకినాడ



మహాసభల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

విజయవాడలో వచ్చే నెల 5న ప్రభుత్వ ఉద్యోగుల సంఘం మహాసభలు

పిఠాపురం, మే 19 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కౌన్సిల్ మూడవ మహాసభలు జూన్ 5న విజయవాడలో జరగనున్నాయి. ఇందుకు సంబంధించిన పోస్టర్లను పిఠాపురంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో సంఘ నాయకులు ఆవిష్కరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ హాజరవుతారని, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్లు రావాలని వారు కోరారు. సంఘం పిఠాపురం యూనిట్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.శ్రీనివాసరావు, మధుసూదనరావు, ప్రియ, ప్రకాశరావు, శివ, కామేశ్వరరావు, పద్మశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



గొల్లప్రోలులో అనధికార లే-ఔట్లలో అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులు

అనధికార లే-ఔట్లలో హెచ్చరిక బోర్డులు

అనుమతులు లేని భవనాలపై ఆరా



ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

గొల్లప్రోలు, మే 19 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలులో అనధికారిక లే-ఔట్లు, ప్లాన్లు, అనుమతులకు విరుద్ధంగా జరుగుతున్న భవన నిర్మాణాలపై నగర పంచాయతీ అధికారులు దృష్టిసారించడంతో పాటు చర్యలు చేపట్టారు. 'గొల్లప్రోలులో టౌన్ ప్లానింగ్ అస్తవ్యస్తం' శీర్షికతో ఆంధ్రజ్యోతిలో సోమవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. దీనిపై నగర పంచాయతీ అధికారులను కలెక్టర్ షాన్‌మోహన్ వివరణ కోరారు. కమిషనరు ఆదేశాల మేరకు టౌన్ ప్లానింగ్ అధికారి నీలిమాదీప్తి ఆధ్వర్యంలో పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు అనధికార లే-ఔట్లను గుర్తించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడంలో నిమగ్నమయ్యారు. గొల్లప్రోలులో 23 అనధికారిక లే-ఔట్లు గుర్తించి ఆరుచోట్ల బోర్డులు ఏర్పాటు చేశామని టీపీవో తెలిపారు. అనధికారిక భవనాలపై చర్యలు తీసుకునేందుకు నోటీసులు జారీ చేస్తున్నామని చెప్పారు.



గొల్లప్రోలు బస్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న జేసీ రాహుల్‌మీనా, జిల్లా ప్రజా రవాణా అధికారి శ్రీనివాస్

బస్ స్టేషన్ల అభివృద్ధికి ప్రణాళికలు: జేసీ

గొల్లప్రోలు, మే 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల కోసం నైట్‌హాల్ట్ బస్సులు నిలిపేందుకు వీలుగా పిఠాపురం, గొల్లప్రోలు బస్ స్టేషన్ల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనా తెలిపారు. సోమవారం సాయంత్రం ఆయన గొల్లప్రోలు బస్ స్టేషన్‌ను పరిశీలించారు. కళాశాల విద్యార్థుల కోసం ఎలక్ట్రికల్ బస్సులను అందుబాటులోకి తీసుకువచ్చి వాటిని బస్‌స్టేషన్లల్లో నిలిపేందుకు అవసరమైన సదుపాయాల కల్పనకు గొల్లప్రోలు బస్ స్టేషన్ అభివృద్ధికి రూ.8లక్షలు, పిఠాపురం బస్ స్టేషన్‌కు రూ.19లక్షలతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. గొల్లప్రోలులో నాలుగు నైట్‌హాల్టు బస్సులు నిలిపేలా, ఇక్కడ సిబ్బంది ఉండేందుకు వీలుగా సౌకర్యాలు కల్పించనున్నారు. జేసీ వెంట జిల్లా ప్రజా రవాణా అధికారి శ్రీనివాస్, కాకినాడ డిపో మేనేజరు మనోహర్, అసిస్టెంట్ మేనేజరు బాలకృష్ణ, తహసీల్దారు సత్యనారాయణ, ఈవోపీఆర్డీ కుమార్ వున్నారు.



పాడా కార్యాలయంలో వినతులు స్వీకరిస్తున్న ప్రాజెక్టు డైరెక్టర్ చైత్రవర్షిణి

పీజీఆర్‌ఎస్‌కు 49 వినతులు

పిఠాపురం, మే 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాడా కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ప్రజల నుంచి 49 వినతులను ప్రాజెక్టు డైరెక్టర్ చైత్రవర్షిణి స్వీకరించారు. మునిసిపాలిటీకి సంబంధించి 25, రెవెన్యూకు 13, ఇతర శాఖలకు 11 వినతులు అందాయి. వీటిని నిర్ణీత కాలవ్యవధిలోగా పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులను ఆమె ఆదేశించారు. పట్టణంలో మద్యం షాపులు నిర్దేశిత సమయం కంటే అధికంగా తెరిచి ఉంటున్నాయని సీపీఐ కార్యదర్శి సాకా రామకృష్ణ ఫిర్యాదు చేశారు. పీజీఆర్‌ఎస్‌లో ఉపాధి హామీ ఏపీడీ వసంత మాధవి, మునిసిపల్ కమిషనరు నామ కనకారావు, తహసీల్దారు వీవీ గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాల్లో నిర్మాణాల పరిశీలన

గొల్లప్రోలు రూరల్, మే 19 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం చిన జగ్గంపేటలో ప్రభుత్వ స్థలాల్లో ఉన్న నిర్మాణాలను జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా సోమవారం సాయంత్రం పరిశీలించారు. 2019 డిసెంబరుకు ముందు ప్రభుత్వ స్థలాల్లో ఉన్న భవనాలు, నిర్మాణాలను రెగ్యులరైజ్ చేసుకునేందుకు ప్రభుత్వ అవకాశం కల్పించింది. దీని నిమిత్తం వచ్చిన దరఖాస్తులపై ఆయన పరిశీలన జరిపారు. డోర్ నెంబర్లల్లో వ్యత్యాసాలు సరిచేయాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. జేసీ వెంట తహసీల్దారు సత్యనారాయణ, ఆర్ఐ బాలకృష్ణ, ఈవోపీఆర్డీ కుమార్ వున్నారు.

'పుచ్చలపల్లి సుందరయ్య స్ఫూర్తిని కొనసాగిద్దాం'

కాకినాడ సిటీ, మే 19 (ఆంధ్రజ్యోతి): పేద ప్రజలు, రైతుల కోసం అహర్నిశలు పోరాడిన సుందరయ్య స్ఫూర్తిని కొనసాగిద్దామని వక్తలు పేర్కొన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు, దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతి సందర్భంగా సోమవారం సుందరయ్య భవన్‌లోని ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఎం నగర కమిటీ సభ్యుడు కె.సత్తిరాజు అధ్యక్షత వహించిన సభలో జిల్లా కమిటీ సభ్యురాలు జి.బేబీరాణి, నగర కన్వీనర్ పలివెల వీరబాబు, నాయకులు వీవీ రాఘవులు, కర్రి నాగేశ్వరరావు, కె.వీరబాబు, వాసంశెట్టి చంద్రరావు, జోగా అప్పారావు, వర్మ మాట్లాడారు. స్వాతంత్రోద్యమంలో పాల్గొని ఆ తర్వాత కమ్యూనిస్టుగా మారి కీలకంగా పని చేశారన్నారు. పార్లమెంట్‌లో తొలి ప్రతిపక్ష నేతగా, ఆంధ్రప్రదేశ్ శాసనమండలిలో సభ్యునిగా వాణి వినిపించారన్నారు. కష్టజీవుల రాజ్యం కోసం నిరంతరం శ్రమించిన సుందరయ్య స్ఫూర్తితో ప్రజా ఉద్యమాల నిర్మాణానికి నేటి తరం కమ్యూనిస్టులు కృషి చేయాలన్నారు. 'ఉన్నంతలో సాయం ఉన్నంత వరకు చేద్దాం" పిలుపునకు స్పందిస్తూ అనేక మంది తమ ఇళ్లల్లోని వస్తువులు, దుస్తులను సుందరయ్య భవన్‌లో అందజేశారు. అవసరమైవారికి వీటిని అందిస్తామని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యుడు సీహెచ్ రాజ్‌కుమార్, మలకా వెంకటరమణ, నాగాబత్తుల సూర్యనారాయణ, మేడిశెట్టి వెంకరమణ, రామలక్ష్మి, భారతి తదితరులు పాల్గొన్నారు.



కాకినాడలో సుందరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కమ్యూనిస్టు నాయకులు

పెద్దాపురం (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని యాసలపు సూర్యారావు భవనంలో కామ్రేడ్ సుందరయ్య 40 వర్ధంతిని నీలపాల సూరిబాబు అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు దువ్వా శేషుబాబ్జీ, జిల్లా కార్యదర్శి కరణం ప్రసాదరావు సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు క్రాంతికుమార్, సిరిపురపు శ్రీనివాస్, స్నేహ, డి.కృష్ణరాజు, సత్యనారాయణ, నరసింహమూర్తి, రమేష్, అరుణ్, మరిడియ్య తదితరులు పాల్గొన్నారు.

తాళ్లరేవు (ఆంధ్రజ్యోతి): స్థానిక సీపీఎం కార్యాలయంలో పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి ఆ పార్టీ నేత టేకుమూడి ఈశ్వరరావు పూలమాల వేసి నివాళులర్పించారు. వడ్డి ఏడుకొండలు, వల్లు రాజబాబు, దుప్పి అదృష్ట దీపుడు, దిలీప్‌కుమార్, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.





పెద్దాపురం, తాళ్లరేవుల్లో కామ్రేడ్ సుందరయ్య చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

పిఠాపురం, గొల్లప్రోలు, సామర్లకోటల్లో భారీ వర్షం

రహదారులు జలమయం

తడిసిన ధాన్యం రాశులు

పిఠాపురం/గొల్లప్రోలు, మే 19 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం, గొల్లప్రోలు పట్టణాల్లో సోమవారం భారీ వర్షం కురిసింది. తెల్లవారుజామున, ఉదయం రెండుసార్లు సుమారు గంటన్నర పాటు కురిసిన వర్షంతో రహదారులన్నీ జలమయమయ్యాయి. డ్రైన్లు పొంగి పొర్లడంతో రోడ్లపైకి నీరు చేరింది. మధ్యాహ్నం నుంచి ఎండ కాయడంతో పాటు ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరయ్యారు. వర్షానికి గొల్లప్రోలు పట్టణ శివారులోని లే-ఔట్లు, ఖాళీ స్థలాలు, చేబ్రోలు-మల్లవరం, పిఠాపురం-సామర్లకోట ఆర్‌అండ్‌బీ రహదారుల వెంబడి ఆరబెట్టిన ధాన్యం రాశులు తడిసిపోయాయి. తరచూ వర్షానికి తడవడం, రెండు రోజులు ఆరబెట్టిన తర్వాత మరలా వర్షం కురుస్తుండడంతో ధాన్యం ఆరబెట్టడానికి వ్యయప్రయాసలకు గురికావాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

సామర్లకోట (ఆంధ్రజ్యోతి): సామర్లకోట మండలం, పట్టణంలో సోమవారం భారీ వర్షం కురిసింది. పలు వార్డుల్లోని లోతట్టు ప్రాంతాలు పూర్తిగా జలమయం అయ్యాయి. డ్రైన్ల నుంచి మురుగునీరు రోడ్లపైకి చేరింది. మండలంలోని పలు మైదాన ప్రాంతాల్లో ఆరబోసిన ధాన్యం రాశులపై బరకాలు తీయకుండా రైతులు రాశులవద్దే కాపలా కాశారు. ప్రభుత్వం ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద సోమవారం ధాన్యం కొనుగోళ్లను ఆశించిన రీతిలో చేయకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. మరోపక్క అధికారుల బదిలీలకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో వారు సర్వీసు రిజిస్టర్లను అప్‌లోడ్ చేసే పనుల్లో వున్నారు. దీంతో తమ అవస్థలు పట్టించుకునేవారే కరువయ్యారని అన్నదాతలు ఆవేదన చెందారు.



సామర్లకోటలో ధాన్యం రాశులు తడవకుండా బరకాలు కప్పిన దృశ్యం

రక్షిత మంచినీటి పథకంలో నిత్యం లీకులే

కూటమి ప్రభుత్వం చొరవతో కొత్త పైప్‌లైను ఏర్పాటుకు చర్యలు

కొత్తపల్లి, మే 19 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలంలోని నాగులాపల్లి ఏరియా సమగ్ర గ్రామీణ రక్షిత మంచినీటి పథకం ద్వారా తాగునీరు అందక ప్రజలు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాకతిప్పలో రక్షిత మంచినీటి పథకం 2000లో ప్రారంభమైంది. దీని ద్వారా మండలంలోని 18 పంచాయతీలకు, సుమారు 30 శివారు గ్రామాలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలి. అయితే పంచాయతీలకు రక్షిత మంచినీటి పథకం రిజర్వాయర్ నుంచి ఒకేసారి మంచినీటిని పంపింగ్ చేసే ప్రధాన పైపులైన్లు తరచూ నీటి వేగానికి పగిలిపోవడంతో ప్రజలకు ఇక్కట్లు తప్పట్లేదు. ప్రధాన పైపులైనుకు నెలలో సుమారు నాలుగైదు చోట్ల లీకులు రావడం, వాటిని గుర్తించడానికి రెండు, మూడు రోజులు ఆలస్యం కావడంతో ప్రజలకు పాట్లు తప్పట్లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సుమారు 25 సంవత్సరాల కిందట నిర్మించిన ప్రధాన పైపులైను స్థానంలో నాణ్యత కలిగిన పైపులైను ఏర్పాటుకు సంబంధిత అధికారులు చర్యలు చేపట్టారు. అదే జరిగితే మండల ప్రజల తాగునీటి సమస్య తీరుతుంది.



వాకతిప్ప సత్తెమ్మ తల్లి గుడి వద్ద మంచినీటి పథకం ప్రధాన పైపులైను పగిలి నీరు వృథాగా పోతున్న దృశ్యం (పాత చిత్రం)



శ్రీకర్‌కు ఆర్థిక సాయం అందజేస్తున్న దృశ్యం

పేద విద్యార్థి చదువుకు రూ.20వేలు ఆర్థిక సాయం

కాకినాడ సిటీ, మే 19 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పెద్ద మార్కెట్ ప్రాంతానికి చెందిన శ్రీకర్ ఇటీవల తండ్రిని కోల్పోయాడు. యానిమేషన్ కోర్సు చేస్తున్న అతడు పేదరికం కారణంగా కాలేజీ ఫీజు చెల్లించడానికి ఇబ్బందిపడుతున్నాడు. విషయం తెలుసుకున్న శ్రీయునసేన ఆధ్వర్యంలో అంబిక అక్వేరియం రెస్టారెంట్ ద్వారా సామాజిక సేవలో భాగంగా రూ.20 వేలు సాయం అందజేశారు. కార్యక్రమంలో రెస్టారెంట్ అధినేత సతీష్, ప్రశాంతి, శివ, హర్ష, హరీష్, దీపు, సనమ్ తదితరులు పాల్గొన్నారు.



టీడీపీ కార్యాలయంలో నాయకులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వర్మ

నేడు పిఠాపురంలో నియోజకవర్గ స్థాయి మినీ మహానాడు

పిఠాపురం, మే 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మునిసిపల్ కల్యాణ మండపంలో మంగళవారం మధ్యాహ్నం 2.30గంటలకు పిఠాపురం నియోజకవర్గ స్థాయి మినీ మహానాడు నిర్వహించనున్నట్టు మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ తెలిపారు. టీడీపీ కార్యాలయంలో నాయకులతో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు, ఎమ్మెల్యేలు నిమ్మకాయల చినరాజప్ప, వనమాడి కొండబాబు, ఎమ్మెల్సీ రాజశేఖరం, టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్, పిల్లి సత్తిబాబు హాజరవుతారన్నారు. నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



సంస్మరణ సభలో మాట్లాడుతున్న మంద కృష్ణ మాదిగ

'ఎమ్మార్పీఎస్ ఉద్యమానికి శ్యామ్‌బాబు విశేష సేవలు'

కాకినాడ సిటీ, మే 19 (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ ఉద్యమానికి, మాదిగ సామాజికవర్గానికి శ్యామ్‌బాబు విశేష సేవలు అందించారని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ పేర్కొన్నారు. సోమవారం ఎస్.అచ్చుతాపురంలో ఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కొండేపూడి శ్యామ్‌బాబు సంస్మరణ సభ కొండేపూడి ఉదయ్‌కుమార్ అధ్యక్షతన జరిగింది. శ్యామ్‌బాబు చిత్రపటానికి మంద కృష్ణ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానికంగా ఏర్పాటుచేసిన ఎమ్మార్పీఎస్ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ 30 ఏళ్ల ఉద్యమ ఫలితంగా ఎస్సీ వర్గీకరణ సాధించడంతో శ్యామ్‌బాబు ఎంతో ఆనందపడ్డారన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లాల ఇన్‌చార్జి అధ్యక్షుడు ముమ్మిడివరపు చినసుబ్బారావు, ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు వల్లూరి సత్తిబాబు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పలివెల నవీన్, ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ మాజీ సభ్యుడు డోకుబుర్ర భద్రం మాస్టర్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ విభాగాల నాయకులు, శ్యామ్‌బాబు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న రైతు కూలీ సంఘం నాయకులు

'రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర చట్టం చేయాలి'

పెద్దాపురం, మే 19 (ఆంధ్రజ్యోతి): రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏపీ రైతు కూలీ సంఘం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని వేంకటేశ్వరస్వామి గుడి సెంటర్లో సోమవారం నిరసన ధర్నా నిర్వహించారు. ఏపీఆర్‌సీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీ రాంజనేయులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రజా, రైతు, కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తోందని విమర్శించారు. వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టే కుట్రలు చేస్తోందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు లేక వలసలు పోతున్నారన్నారు. గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ఏడాదికి 200 రోజులు పని కల్పించాలని, రోజు కూలీ రూ.600 ఇవ్వాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రైస్‌మిల్లర్లు సిండికేట్‌గా ఏర్పడి ధాన్యం కొనుగోలు కేంద్రాలను తమ హస్తగతం చేసుకుని తక్కువ ధరకు ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులకు తీవ్ర అన్యాయం చేస్తున్నాన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించేలా చట్టం చేయాలన్నారు. నాయకులు డి.సురేష్, సత్తిబాబు, దుర్గాదేవి, కోట వీరబాబు, సుంకర శ్రీను, పెరుమల శ్రీను పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామికి పూజలు

గండేపల్లి, మే19(ఆంధ్రజ్యోతి): తాళ్లూరు వెంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం స్వామివారి జన్మ నక్షత్రం శ్రావణం సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ దాపర్తి సీతారామయ్య ఆధ్వర్యంలో ఆలయ పురోహితులు నర్సింమూర్తి, భాస్కరరావు, రమేష్ వేదమంత్రాల నడుమ ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చిన భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. పాలిచర్ల సత్యనారాయణ పాల్గొన్నారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక



అర్జీలు స్వీకరిస్తున్న ఐటీడీఏ పీవో సింహాచలం

ఐటీడీఏ గ్రీవెన్స్‌కు 43 అర్జీలు

రంపచోడవరం, మే 19 (ఆంధ్రజ్యోతి): ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సుమారు 43 అర్జీలు అందాయని ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం తెలిపారు. ఆయన వివిధ శాఖల అధికారులతో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం వరకు ప్రజల అర్జీలు తీసుకున్నారు. అర్జీల పరిష్కారానికి సత్వరం చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అంబేడ్కర్, డిప్యూటీ డైరెక్టర్లు ఎం. రుక్మాండయ్య, షరీఫ్, డీఎల్‌డీవో కోటేశ్వర రావు, ఏపీడీ బి.సత్యనారాయణ, జీసీసీ డీఎం జి.పార్వతీశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు ఐ.శ్రీనివాసరావు, రవికుమార్, ఎంపీడీవో శ్రీనివాస్‌దొర, సీడీపీవో సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.



నిర్వాసితుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న తహశీల్దార్ శ్రీనివాస్

నివాస ప్రాంతాలను ఎంచుకోండి

కూనవరం, మే 19(ఆంధ్రజ్యోతి): కూనవరం, టేకులబోరు గ్రామాల పోలవరం నిర్వాసితులు ఎక్కడ నివాసం ఉంటారో ఆ ప్రాంతాలను ఎంచుకోవాలని కూనవరం తహశీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో నిర్వాసితులతో సమావేశం నిర్వహించారు. గిరిజనులకు మాత్రమే ఇంటిస్థలంతో పాటు ప్రభుత్వం కేటాయించిన సొమ్ములతో ఇంటి నిర్మాణం జరుగుతుందన్నారు. ఇతరులకు ప్రభుత్వం రెండు అవకాశాలు ఇచ్చిందన్నారు. దీనిపై నిర్వాసితుల నుంచి భిన్నాభిప్రాయాలు వస్తున్నాయి. తమకు ప్రభుత్వమే ఇల్లు కట్టి ఇవ్వాలని నిర్వాసితులు కోరుతున్నారు. ప్రభుత్వం నూదికొండ, మల్లవరం, తాడువాయి ప్రాంతాల్లో ఇంటి స్థలాలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉందన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీనివాస్ ఆర్ఐ జల్లి సత్యనారాయణ, వీఆర్వోతో పాటు పోలవరం నిర్వాసితులు తదితరులు పాల్గొన్నారు.



దీక్షల్లో పాల్గొన్న ఆదివాసీ జేఏసీ నాయకులు

కొనసాగుతున్న నిరాహార దీక్షలు

రంపచోడవరం, మే 19 (ఆంధ్రజ్యోతి): షెడ్యూల్డ్ ప్రాంత ఉద్యోగాల నియామకాల చట్టం ప్రకటించాలని ఆదివాసీ జేఏసీ చేస్తున్న రిలే నిరాహర దీక్షలకు ఆదివాసీ మెడికల్, హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా ప్రెసిడెంట్ డి.జోగారావు, నన్నయ యూనివర్సిటీ ప్రొఫెసర్స్ మధు, వీరన్న మద్దతు తెలిపారు. ఐటీడీఏ కార్యాలయం ఎదుట చేస్తున్న దీక్షలు సోమవారానికి ఐదో రోజుకు చేరాయి. ఈ సందర్భంగా జోగారావు, ఆదివాసీ అడ్వకేట్స్ అసోసియేషన్ జిల్లా నాయకుడు ఆత్రం నవీన్‌కుమార్ మాట్లాడారు. అనంతరం గ్రీవెన్స్‌లో ఐటీడీఏ పీవో కట్టా సింహాచలంను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ వడగల ప్రసాద్‌బాబు, పొడియం పండుదొర తదితరులతో పాటు, ఆదివాసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



సుందరయ్యకు నివాళులర్పిస్తున్న దృశ్యం

సుందరయ్య జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలి

ఎటపాక, మే 19 (ఆంధ్రజ్యోతి): పుచ్చలపల్లి సుందరయ్య జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మర్లపాటి నాగేశ్వరరావు అన్నారు. సోమ వారం పుచ్చలపల్లి వర్ధంతిని ఎటపాకలో నిర్వహించారు. ఈ సందర్భంగా సుందరయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం నాగేశ్వరరావు తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి అర్జున్, ఐవీ, పద్మ, బాలకృష్ణ, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

పాలగడ్డ-ఆర్వీనగర్ రోడ్డు సమస్యకు పరిష్కారం చూపాలి

మోతుగూడెం, మే 19 (ఆంధ్రజ్యోతి): డొంకరాయి, రంపచోడవరంలో 20న జరిగే టీడీపీ మినీ మహానాడులో పాలగడ్డ నుంచి జీకే వీధి మండలం ఆర్వీ నగర్ వరకు గల రోడ్డు దుస్థితిపై అధికార పార్టీ నాయకులు ప్రస్తావించి పనులు ప్రారంభం అయ్యేలా చూడాలని డొంకరాయి వైసీపీ వై.రామవరం మండల కో ఆప్షన్ మెంబర్ ఎం.రమణ కోరారు. మినీ మహానాడులో ప్రధాన సమస్యలపై చర్చకు వచ్చినప్పుడు ఈ రోడ్డు పరిస్థితిని దృష్టికి తేవాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి ఇక్కడి రోడ్డు సమస్య తీసుకువెళ్లి సమస్య పరిష్కారం అయ్యేలా చూడాలని సూచించారు.



గుంతలతో అధ్వానంగా మారిన రహదారి

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

కేసులు ఓపెన్ అయితే జగన్ జైలుకే

● మాజీ మంత్రి యనమల
● అన్నవరంలో మినీ మహానాడు

అన్నవరం, మే 19(ఆంధ్రజ్యోతి): కేసులు ఓపెన్ అయితే జగన్ జైలుకే పరిమితమవుతారని, ఆయన కోసం ఎవరూ పట్టించుకోవలసిన అవసరం లేదని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు అన్నారు. ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ఆధ్వర్యంలో సోమవారం అన్నవరం హరిహర రిసార్ట్స్‌లో జరిగిన మినీ మహానాడులో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. అధిక సంఖ్యలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలేసి నివాళులర్పించారు. జగన్ వస్తే ఏదో చేస్తానని అంటున్నారని, ఎవరూ ఆ రాక్షస రాజ్యం కోసం ఆలోచించకుండా మన రామ రాజ్య స్థాపన కోసం పని చేయాలన్నారు.




అన్నవరం మినీ మహానాడులో మాజీ మంత్రి యనమల, సమావేశానికి హాజరైన కార్యకర్తలు

అప్పుల్లో ఉన్న రాష్ట్రాన్ని చంద్రబాబు గాడిన పెడుతున్నారని, సంపద సృష్టించి ఉపాధి అవకాశాల లక్ష్యంగా సీఎం ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. నియోజకవర్గాన్ని మోడల్‌గా అభివృద్ధి చేయాలన్నదే తన ధ్యేయమని ఎమ్మెల్యే సత్యప్రభ అన్నారు. మారుమూల ప్రాంతాలకు కూడా మౌలిక సదుపాయాలు, ఉపాధి కల్పన, తాగునీరు అందించాలన్నదే తన భర్త లక్ష్యాన్ని తాను నెరవేరుస్తానని పేర్కొన్నారు. నియోజకవర్గంలో పలు పనులకు తీర్మానం చేశారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్, నియోజకవర్గ పరిశీలకుడు మెట్ల రమణ బాబు, సరిపెళ్ల రాజేష్, సీనియర్ నేత పర్వత సురేష్, యాళ్ల జగదీష్, గొల్లపల్లి బుజ్జి, బద్ది రామారావు, ఉల్లి వీరభద్రరావు, వెన్నా శివ, బద్ది రమణ, కీర్తి వెంకటసుభాష్, రాజాల చిట్టిబాబు, బొమ్మిడి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి అభినందన

శంఖవరం, మే 19 (ఆంధ్రజ్యోతి): పాలిసెట్‌లో స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించిన బద్ది శశి వెంకట్‌ను సోమవారం సాయిప్రియా సేవాసమితి అధ్యక్షుడు జ్యోతుల శ్రీనివాస్ సత్కరించారు. స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించి మెట్ట ప్రాంతానికి వన్నె తెచ్చారని కొనియాడారు. అలాగే తల్లిదండ్రులు లోవరాజు, వీరలక్ష్మీలకు అభినందనలు తెలిపారు. ఇదే స్ఫూర్తితో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. మేకల కృష్ణ, సర్ల గోవిందు, గొర్లి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

'రికార్డు లేని వాహనాలను తాకట్టు పెట్టుకోవద్దు'

జగ్గంపేట, మే 19 (ఆంధ్రజ్యోతి): రికార్డులు లేకుండా ఎవరైనా వాహనాలు తీసువస్తే తాకట్టు పెట్టుకోవద్దని పోలీసులు వడ్డీ వ్యాపారులకు విజ్ఞప్తి చేశారు. వాహనాలను తీసుకువచ్చిన వారి పేరు మీద రికార్డులు ఉంటేనే తాకట్టు పెట్టుకోవాలన్నారు. రికార్డులు లేకుండా వాహనాలను తాకట్టుపెట్టుకున్న వారిపై కేసులు నమోదు చేస్తామని పోలీసులు హెచ్చరించారు.

జగ్గంపేటలో ఓయాసిస్ జననీ యాత్ర

జగ్గంపేట, మే 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక నీరజ ఆసుపత్రిలో ఓయాసిస్ జననీ యాత్ర పేరిట ఉచిత మొబైల్ ఫెర్టిలిటీ క్యాంపు సెంటర్ మేనేజర్ బ్రహ్మాజీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ మాట్లాడుతూ ప్రస్తుతం ఎక్కువ మంది పిల్లలను కనడానికి ప్రభుత్వమే ప్రోత్సహిస్తుందన్నారు. అనంతరం డాక్టర్ ప్రీతి ప్రియదర్శిని మాట్లాడారు. సంతానం లేని తల్లిదండ్రుల కలలు నెరవేరుస్తున్నామన్నారు. కార్యక్రమంలో నీరజ హాస్పటల్ వైద్యులు, సిబ్బంది, సంతానం లేని తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎంపీడీవోకు శుభాకాంక్షలు



గండేపల్లి, మే 19(ఆంధ్రజ్యోతి): గండేపల్లి ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టిన రాజమనోహర్‌కు సోమవారం మండలంలోని పంచాయతీ కార్యదర్శులు పుష్పగుచ్ఛాలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా గ్రామాల్లో వివిధ అభివృద్ధి అంశాలపై మాట్లాడారు. విధి నిర్వాహణలో అందరూ పూర్తిగా సహకరిస్తే మండలాన్ని అభివృద్ధి, సంక్షేమంలో ముందుకు తీసుకెళ్లవచ్చని ఎంపీడీవో పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్యదర్శులు బి.శిరీష, కేవీఆర్ ఫణీంద్రకుమార్, వెంకటరామనాథ్, సీహెచ్‌వీవీ సత్యనారాయణ, ఎ.తరంగణి పాల్గొన్నారు.

మినీమహానాడుకు తరలిన శ్రేణులు




ప్రత్తిపాడులో మహానాడుకు తరలివెళ్తున్న టీడీపీ నాయకులు, వాకపల్లి నుంచి నాయకులు, కార్యకర్తలు

ప్రత్తిపాడు, మే 19(ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా ఆధ్వర్యంలో సోమవారం అన్నవరంలో జరిగిన నియోజకవర్గ మినీ మహానాడుకు ప్రత్తిపాడు మండలం నుంచి అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. తొలుత ప్రత్తిపాడులో వరుపుల రాజా విగ్రహానికి టీడీపీ నాయకులు, కార్యకర్తలు నివాళులర్పించారు. వాకపల్లి, పోతులూరు, ధర్మవరం, ఉత్తరకంచి తదితర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో టీడీపీ శ్రేణులు అన్నవరం తరలివెళ్లారు.

రౌతులపూడి,(ఆంధ్రజ్యోతి): అన్నవరంలో జరిగిన మినీ మహానాడుకు మండలంలోని గ్రామాల నుంచి అధిక సంఖ్యలో కార్యకర్తలు తరలివెళ్లారు. మూలగపూడి నుంచి పార్టీ మండల అధ్యక్షుడు తమరాల సత్యనారాయణ వందల బైక్‌లతో భారీ ర్యాలీగా తరలివెళ్లారు. రౌతులపూడి నుంచి మాజీ ఎంపీపీ ఇటంశెట్టి సూర్యభాస్కరరావు, మాజీ సర్పంచ్ పైల సాంబశివరావు ఆధ్వర్యంలో బైక్‌లపై తరలివెళ్లారు. ప్రతి గ్రామం నుంచి తరలివెళ్లగా రహదారులన్నీ పసుపుమయంగా మారాయి.



ఏలేశ్వరం: పెద్దనాపల్లి నుంచి వెళ్తున్న తెలుగు తమ్ముళ్లు

ఏలేశ్వరం,(ఆంధ్రజ్యోతి): ఏలేశ్వరం మండలం, పట్టణం నుంచి అన్నవరంలో జరిగిన మినీ మహానాడుకు నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. సోమవారం ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు మూది నారాయణస్వామి, కౌన్సిలర్ బొదిరెడ్డి గోపి, జ్యోతుల పెదబాబు, పెద్దనాపల్లి గొల్లపల్లి యువసేన, పట్టణం నుంచి బొదిరెడ్డి గోపి యువసేన నేతృత్వంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు బస్సులపై మహానాడుకు వెళ్లారు.

కార్మికులకు ఉపాధి కల్పించండి



మాట్లాడుతున్న మానుకొండ లచ్చబాబు

ప్రత్తిపాడు, మే 19(ఆంధ్రజ్యోతి): కార్మికులకు ఉపాధి, రక్షణ కల్పించాలని అఖిల భారత వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మానుకొండ లచ్చబాబు డిమాండ్ చేశారు. యుజేపురం గ్రామంలో సోమవారం సాయంత్రం నిర్వహించిన సీపీఐ ఎంఎల్ లిబరేషన్ గ్రామీణ కార్మిక సంఘాల సమావేశంలో మానుకొండ మాట్లాడారు. కార్మికుల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నాయన్నారు. గ్రామీణ వ్యవసాయ రంగ కార్మికులు, కూలీలు పనులు లేక ఇబ్బందులు పడుతున్నారని, ఉపాధి హామీ పథకం ద్వారా సంవత్సరం పొడవునా పని కల్పించి, వేతనాలు పెంచాలన్నారు. కార్మికులు, కర్షకుల ఐక్యత వర్ధిల్లాలని పలువురు సమావేశంలో కోరారు. దేశ వ్యాప్తంగా జూన్‌లో జరిగే బంద్‌ను విజయవతం చేయాలని కార్మిక సంఘం నాయకులు కోరారు. సమావేశంలో సంఘ నాయకులు గోడ శివ, బాబూరావు, మార్ని శ్రీను, జి.నారాయణుడు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్‌లో పేదలకు అన్నదానం

జగ్గంపేట, మే 19(ఆంధ్రజ్యోతి): స్థానిక కాకినాడ రోడ్డులో గల ఎన్టీఆర్ స్మారక మందిరం వద్ద మూడేళ్లుగా ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ ఆధ్వర్యంలో దాతల సహకారంతో నిర్వహిస్తున్నారు. జగ్గంపేట గ్రామానికి చెందిన కొయ్యన ఉమామహేశ్వరరావు జ్ఞాపకార్థం భార్య లక్ష్మి, కుమారుడు రోహిత్ ఆర్థిక సహాయంతో సోమవారం అన్నాక్యాంటీన్‌లో పేదలకు భోజనం సదుపాయం కల్పించారు. ఈకార్యక్ర మన్ని టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ కుమార్ ప్రారంభించారు. కొయ్యన అప్పారావు, కొయ్యన జయ



సూర్యనారాయణ, అల్లు సతీష్, అల్లు స్వర్ణ దుర్గ, అల్లు హేత్రిక, ఈగల సత్యవతి, ఒమ్మి రేఖ, ఒమ్మి ధనుష్, ఎం.విజయ, పైల సత్యవతి, కొత్త కొండబాబు, బద్ది సురేష్, దాపర్తి సీతారామయ్య, దేగల సత్యనారాయణ, మారిశెట్టి గంగ, ఎండీ కాజా, యల్లమిల్లి సీఎం, నాగిరెడ్డి అనీల్ పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



శిక్షణ తరగతులను ప్రారంభిస్తున్న ఎంపీడీవో

ఎటపాక, మే 19 (ఆంధ్రజ్యోతి): మహిళల ఆర్థిక స్వావలంబనే ప్రభుత్వ లక్ష్యమని, మహిళలు స్వశక్తితో ఎదగాలని ఎంపీడీవో ఇ.ప్రేమ్‌కుమార్ ఆకాంక్షించారు. సోమవారం ఎంపీడీవో సమావేశ హాల్లో బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన ఉచిత కుట్టు శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. కుట్టుమిషన్ శిక్షణకు 163 మంది దరఖాస్తు చేసుకున్నారని, వారందరినీ రెండు గ్రూపులుగా విభజించి, మూడు నెలల పాటు నిష్ణాతులైన ట్రైనర్‌తో శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో బీసీ కార్పొరేషన్ జిల్లా కోఆర్డినేటర్ బీరా సునీల్ పాల్గొన్నారు.

ఏకలవ్య కళాశాలల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

డిప్యూటీ డైరెక్టర్ రుక్మాండయ్య

రంపచోడవరం, మే 19 (ఆంధ్రజ్యోతి): రంపచోడవరం, చింతూరు డివిజన్లలోని ఏకలవ్య కళాశాలల్లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో 2025-26 సంవత్సరానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎం.రుక్మాండయ్య తెలిపారు. రాజవొమ్మంగి 30, మారేడుమిల్లి 30, వై.రామవరం 30, చింతూరు 31 సీట్లు ఖాళీలు ఉన్నాయన్నారు. విద్యార్థుల ప్రవేశానికి దరఖాస్తులను ఈ నెల 30లోగా సంబంధిత కళాశాలల్లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు.

ఎయిడ్స్‌పై కళాజాత

జగ్గంపేట, మే 19(ఆంధ్రజ్యోతి): జగ్గంపేటలో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో హెచ్‌ఐవీ ఎయిడ్స్‌పై కళాజాత నిర్వహించారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో హెచ్‌ఐవీ వ్యాధి పట్ల తీసుకోవాల్సిన పలు జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.



కళాజాత నిర్వహిస్తున్న దృశ్యం

ఏలేశ్వరంలో మజ్జిగ పంపిణీ

ఏలేశ్వరం, మే19(ఆంధ్రజ్యోతి): వివేకానంద సేవాసమితి నేతృత్వంలో సోమవారం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో ప్రెస్‌క్లబ్ ధన సహాయంతో బాటసారులకు, రోగులకు మజ్జిగ పంపిణీ చేశారు. ప్రతీ రోజు దాతల సహాయంతో మజ్జిగ పంపిణీ చేస్తున్నట్లు సేవా సమితి అధ్యక్షుడు ఖైరాల నాగేశ్వరరావు తెలిపారు.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి

గండేపల్లి, మే 19(ఆంధ్రజ్యోతి): పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరుతూ తాళ్లూరులో సోమవారం ఉపాధ్యాయులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నారు. ఎంఈవో కె.వెంకటరెడ్డి, ఉపాధ్యాయులు కె.గోవిందు, మాధవి, అప్పారావు, అంగన్వాడీ టీచరు వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

'ఆదిత్య'లో ప్రొఫెషనల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం

గండేపల్లి, మే 19(ఆంధ్రజ్యోతి): ఆదిత్య యూనివర్శిటీ ఫ్రెష్ మ్యాన్ ఇంజనీరింగ్ విభాగంలో నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ టీచర్స్ ట్రైనింగ్ అండ్ రీసెర్చ్ వారి సౌజన్యంతో ఫౌండేషన్ ఆఫ్ టీచింగ్ అండ్ లెర్నింగ్ అనే అంశంపై ఐదురోజుల ప్రొఫెషనల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ఉత్సాహంగా ప్రారంభమైందని ఆదిత్య డిప్యూటీ ప్రోచాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. చెన్నై నుంచి వచ్చిన ప్రతినిధులు ప్రొఫెసర్ ఎం.శ్రీనివాసన్, ప్రొఫెసర్ వందనదేవి నేతృత్వంలో అధ్యాపక వృత్తిలో వివిధ నైపుణ్య అంశాలపై అవగాహన, శిక్షణ అందిస్తారన్నారు.

తుని మహానాడును విజయవంతం చేయండి

మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు



మాట్లాడుతున్న టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు

తుని రూరల్, మే 19(ఆంధ్రజ్యోతి): తుని టీడీపీ క్యాంప్ కార్యాలయ ఆవరణలో ఎమ్మెల్యే దివ్య అధ్యక్షతన మంగళవారం నిర్వహించనున్న తుని నియోజకవర్గ మహానాడును కార్యకర్తలు విజయవంతం చేయాలని మాజీ మంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు కోరారు. తేటగుంట టీడీపీ క్యాంప్ కార్యాలయంలో సోమవారం నియోజకవర్గ సీనియర్ నాయకులతో సమావేశమై మహానాడు సభ ఏర్పాట్లపై సమీక్షించారు. మహానాడు విజయవంతానికి పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు యనమల రాజేష్, సుర్ల లోవరాజు, చింతమనీడి అబ్బాయి, మీసాల రాజు, తమరాన సత్యనారాయణ, సర్ల బోడయ్యపాల్గొన్నారు.

ఆదిత్యలో ఏపీఈఏపీ సెట్ పరీక్షలు

గండేపల్లి, మే 19(ఆంధ్రజ్యోతి): సూరంపాలెం ఆదిత్య విద్యా ప్రాంగణంలో ఏపీఈఏపీ సెట్ 2025 ఆన్‌లైన్ ఎగ్జామ్స్ మొదటిరోజు ప్రశాంతంగా జరిగినట్లు ఆదిత్య యూనివర్శిటీ డిప్యూటీ ప్రోచాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. జేఎన్‌టీయూకే యూనివర్శిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ ఏపీఈఏపీసెట్ 2025 ఎగ్జామ్స్ సోమవారం మొదటి రోజు ప్రశాంతంగా జరిగాయన్నారు. ఆదిత్య యూనివర్శిటీలో ఉదయం పరీక్షకు 240మందికి 220, మధ్యాహ్నం పరీక్షకు 240మందికి 227, ఆదిత్య కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో 296 మందికి 272, మధ్యాహ్నం పరీక్షకు 296 మందికి 281మంది హాజరయ్యారన్నారు.